## 2.1 పరిచయం

విధానపరమైన నిర్ణయాలు దుబారా లేకుండానూ, నిధుల మళ్లింపులు జరగకుండానూ పరిపాలన స్థాయిలో సక్రమంగా అమలయ్యేలా చూడడానికి ప్రభావవంతమైన ఆర్థిక నిర్వహణ దోహదపడుతుంది. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో ఈ విధాన నిర్ణయాల అమలు సఫలం కావటానికి తగు భరోసాను కూడా ఇది కల్పిస్తుంది. బడ్జెట్ కేటాయింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమ్యాలపై ఆడిట్ సమీక్ష, బడ్జెట్ ప్రక్రియల్లోని పారదర్శకత, సాఫల్యతలపై ఆడిట్ వ్యాఖ్యలు ఈ అధ్యాయంలో ఉన్నాయి.

## 2.2 బడ్జెట్ ప్రక్రియ

ఆర్థికపరమైన విషయాల్లోనూ, బడ్జెట్ సంబంధిత విషయాల్లోనూ అనుసరించాల్సిన విధానాలను ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్, ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్ నిర్దేశిస్తాయి. సాధారణంగా, రాష్ట్రంలో బడ్జెట్ రూపకల్పన దీనికి సంబంధించిన బడ్జెట్ క్యాలెండర్ ప్రకారమే జరుగుతుంది. ప్రతి ఏటా అక్టోబరులో తదుపరి ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల రూపకల్పన మొదలవుతుంది. ఐతే, వివిధ శాఖలను తనిఖీ చేసినప్పుడు, అతిక్రమణలకు తావులేకుండానూ, ఏడాది చివర్లో ఆశ్చర్యకర పరిస్థితులు తలెత్తకుండానూ చూసే విధంగా, ఖర్చుల వివరాలను ఆర్థిక శాఖకు ప్రతి నెలా సమర్పించే కేంద్రీకృత వ్యయ నియంత్రణ యంత్రాంగం లేదని వెల్లడైంది.

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్ ప్రకారం, బడ్జెట్ రూపకల్పన ప్రక్రియలో కింది స్థాయి నుండి పై స్థాయి వరకూ పాల్గొనాలి. అంటే, యూనిట్ స్థాయిలో అవసరమైన నిధుల వివరాలను జిల్లా స్థాయిలోనూ, తర్వాత సంబంధిత శాఖ స్థాయిలోనూ క్రోడీకరించాలి. ఐతే, ఈ ఏడాది ఆడిట్ చేసిన ప్రభుత్వ శాఖల్లో ఈ విధానాన్ని అనుసరిస్తున్న దాఖలాలేవీ కనబడలేదు. ప్రభుత్వ శాఖల్లో అమలవుతున్న వివిధ పథకాలనూ, లావాదేవీలనూ తనిఖీ చేసినప్పుడు, యూనిట్/జిల్లా స్థాయిలోకానీ సంబంధిత శాఖ స్థాయిలోకానీ ప్రతిపాదిత ఆర్థిక వనరులకూ, వాటి తాలూకు భౌతిక ఫలితాలకూ పొంతన లేదని వెల్లడైంది. వాస్తవంగా కావలసిన నిధుల ఆవశ్యకతను విశ్లేషించటంలోనూ, అంచనా వేయటంలోనూ తగిన కృషి జరగలేదు. ప్రభుత్వం గత కొన్నేళ్ళుగా ఫలితాల బడ్జెట్‌ను వెలువరిస్తున్నప్పటికీ, ప్రభుత్వ శాఖలు, ఒక ఏడాదికి నిర్ణయించిన లక్ష్యాలను ఎంతమేరకు సాధించిందీ ఆ తదుపరి సంవత్సరానికి సమర్పించే బడ్జెట్ ప్రతిపాదనల్లో నివేదించడం లేదు.

## 2.3 ఆర్థికపరమైన జవాబుదారీతనం, బడ్జెట్ నిర్వహణ

ప్రతి ఆర్థిక సంవత్సరంలోనూ, అప్రోప్రియేషన్ చట్టానికి అనుబంధంగా ఉన్న షెడ్యూళ్ళలో నిర్దేశించిన వివిధ ప్రయోజనాల కోసం ఓటుచేసిన గ్రాంట్లు, ఛార్జి చేసిన అప్రోప్రియేషన్ల మొత్తాలతో పోల్చి చూసినపుడు, వాస్తవంగా అయిన ప్రభుత్వ ఖర్చుల పద్దులను 'వినిమయ పద్దులు' (అప్రోప్రియేషన్ అకౌంట్లు) అంటారు. తొలి బడ్జెట్ అంచనాలు, అనుబంధ గ్రాంట్లు, సరెండర్లు, రీ-అప్రోప్రియేషన్ల మొత్తాలను ఈ అకౌంట్లు స్పష్టంగా తెలుపుతాయి. అప్రోప్రియేషన్ చట్టంలో ఆమోదించిన మొత్తాలకు ప్రతిగా వివిధ సేవలపై వాస్తవంగా అయిన క్యాపిటల్, రెవెన్యూ ఖర్చుల వివరాలు ఈ పద్దుల్లో ఉంటాయి. ఆర్థిక వనరుల వినియోగం, బడ్జెట్ కేటాయింపుల పర్యవేక్షణల గురించి అర్థం చేసుకోవడంలో అప్రోప్రియేషన్ అకౌంట్లు ఉపకరిస్తాయి. ఆ విధంగా, ఇవి ఆర్థిక పద్దులకు (ఫైనాన్స్ అకౌంట్లకు) అనుబంధంగా ఉంటాయి.

వివిధ గ్రాంట్ల కింద వాస్తవంగా చేసిన ఖర్చులు అప్రోప్రియేషన్ చట్టంలో ఆమోదించిన మొత్తాలను అతిక్రమించలేదనీ రాజ్యాంగపు నిబంధనల ప్రకారం ఛార్జి చేయాల్సిన విధంగానే ఖర్చులను ఛార్జి చేసారనీ నిర్ధారించుకోవడానికి భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సీఏజీ) అప్రోప్రియేషన్ పద్దులను తనిఖీ చేస్తారు. అంతేకాకుండా, చేసిన ఖర్చులు సంబంధిత చట్టాలు, నియమ నిబంధనలు, ఆదేశాలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అని కూడా నిర్ధారించుకోవడం జరుగుతుంది.

## 2.4 వినిమయ పద్దుల సంగ్రహం

నలభై గ్రాంట్లు/అప్రోప్రియేషన్లకు సంబంధించి 2012-13లో వాస్తవంగా అయిన ఖర్చుల వివరాలను సంక్షిప్తంగా పట్టిక 2.1 లో ఇవ్వటం జరిగింది.

**పట్టిక 2.1: బడ్జెట్ కేటాయింపులకు ప్రతిగా వాస్తవంగా అయిన ఖర్చుల సంక్షిప్త స్థితి**

(₹ కోట్లలో)

| | ఖర్చుల స్వభావం | తొలి గ్రాంటు/ అప్రోప్రియేషన్ | అనుబంధ గ్రాంటు/ అప్రోప్రియేషన్ | మొత్తం | వాస్తవంగా అయిన ఖర్చు[1] | మిగులు (-)/ అదనం (+) |
|---|---|---|---|---|---|---|
| ఓటు చేసినవి | I రెవెన్యూ | 1,00,368.00 | 9,157.09 | 1,09,525.09 | 91,915.69 | (-)17,609.40 |
| | II క్యాపిటల్ | 19,846.17 | 1,568.94 | 21,415.11 | 15,373.58 | (-)6,041.53 |
| | III ఋణాలు, అడ్వాన్సులు | 4,726.06 | 178.64 | 4,904.70 | 3,912.86 | (-)991.84 |
| మొత్తం ఓటు చేసినవి | | **1,24,940.23** | **10,904.67** | **1,35,844.90** | **1,11,202.13** | **(-)24,642.77** |
| ఛార్జి చేసినవి | I రెవెన్యూ | 12,361.24 | 11.86 | 12,373.10 | 11,795.54 | (-)577.56 |
| | II క్యాపిటల్ | 127.63 | 73.06 | 200.69 | 29.14 | (-)171.55 |
| | III ప్రజా ఋణం తిరిగి చెల్లింపు | 8,813.42 | — | 8,813.42 | 7,676.85 | (-)1,136.57 |
| మొత్తం ఛార్జి చేసినవి | | **21,302.29** | **84.92** | **21,387.21** | **19,501.53** | **(-)1,885.68** |
| పూర్తి మొత్తం | | **1,46,242.52** | **10,989.59** | **1,57,232.11** | **1,30,703.66** | **(-)26,528.45** |

*మూలం : వినిమయ పద్దులు 2012-13*

*గమనిక : i) ఈ ఆర్థిక సంవత్సరం చేసిన ఖర్చులో ₹ 1,608 కోట్ల మొత్తానికిసంబంధించిన డాక్యుమెంట్లు/వోచర్లు అందుబాటులో లేని కారణంగా ఈ ఖర్చుల వాస్తవికతను ధృవీకరించలేము.*

*ii) కంటింజెన్సీ నిధికి తిరిగి జమ చేయని అడ్వాన్సుల మొత్తం ₹ 2.05 కోట్లు. వాస్తవ ఖర్చును ఆమేరకు తగ్గించి చూపడమైంది.*

*iii) ఆకస్మిక ఖర్చుల (ఎ.సి.) బిల్లులపై 2012-13 లో డ్రా చేసిన ₹ 394 కోట్ల మొత్తానికి వివరణాత్మక కంటింజెంట్ (డి.సి.) బిల్లులు లేని కారణంగా ఈ ఖర్చుల యదార్థతను ధృవీకరించలేము.*

రెవెన్యూ విభాగం కింద 37 గ్రాంట్లు, 11 అప్రోప్రియేషన్లు, క్యాపిటల్ విభాగం కింద 28 గ్రాంట్లు, మూడు అప్రోప్రియేషన్లు, లోన్లు విభాగం కింద 13గ్రాంట్లు, ఒక అప్రోప్రియేషన్ (ప్రజా ఋణం) లలో ₹ 26,804 కోట్ల మిగులు ఏర్పడింది. ఐతే, రెవెన్యూ విభాగం కింద మూడు గ్రాంట్లు[2], ఒక అప్రోప్రియేషన్[3], క్యాపిటల్ విభాగం కింద రెండు గ్రాంట్లలో[4] ₹ 276 కోట్లు అధికంగా ఖర్చయింది. ఫలితంగా ₹ 26,528 కోట్ల నికర మిగులు ఏర్పడింది.

బడ్జెట్‌లో చేసిన తొలి కేటాయింపుల మొత్తం ₹ 1,46,242.52 కోట్లు కంటే కూడా తక్కువగా ₹ 1,30,703.66 కోట్లు మాత్రమే వాస్తవంగా ఖర్చయింది, కనుక అనుబంధ కేటాయింపులన్నీ అనవసరమని తేలింది. ఇది బడ్జెట్ ప్రతిపాదనలలోని అవాస్తవికతను తెలియజేస్తోంది.

[1] ఈ సంఖ్యలు స్థూల విలువలను సూచిస్తాయి. రెవెన్యూ వ్యయం కింద ₹ 1,009 కోట్లు, క్యాపిటల్ వ్యయం కింద ₹ 254 కోట్లు చొప్పున ఖర్చులో తగ్గుదలగా పద్దులలో సర్దుబాటు చేసిన రికవరీలను వీటిలో పరిగణించలేదు

[2] X-ఆంతరంగిక పరిపాలన (₹ 166.96 కోట్లు), XI-రోడ్లు, భవనాలు, పోర్టులు (₹ 57.54 కోట్లు), XXXIX-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్లు (₹ 48.83 కోట్లు)

[3] XVI-వైద్యం, ఆరోగ్యం (₹ 7,741కోట్లు)

[4] XVII-మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (₹ 1.91 కోట్లు), XXIX-అడవులు, శాస్త్ర సాంకేతిక మరియు పర్యావరణం (₹ 0.38 కోట్లు)

### 2.4.1 కేటాయింపుల ప్రాథమ్యాలకు ప్రతిగా చేసిన నిధుల వినిమయం

2012-13 లో ప్రభుత్వ రాబడుల విషయంలోనూ, ఖర్చుల విషయంలోనూ బడ్జెట్ కేటాయింపులతో వైరుధ్యం ఏర్పడింది. బడ్జెట్ ప్రక్రియ, బడ్జెట్‌పై పర్యవేక్షణ ప్రక్రియ, నిర్వహణ సమాచార వ్యవస్థల పటుత్వంపై దీని వలన సందేహాలు కలుగుతాయి.

2012-13 ఆర్థిక సంవత్సరంలో, వినిమయ పద్దుల ఆడిట్ నిర్వహించగా, 23 గ్రాంట్ల విషయంలో, ఒక్కొక్క కేసులోనూ ₹ 100 కోట్ల కంటే అధికంగానూ, మొత్తం కేటాయింపులో 20 శాతంకంటే అధికంగానూ మిగుళ్ళు (₹ 13,176 కోట్లు) ఏర్పడ్డాయని వెల్లడైంది. మొత్తం మిగుళ్ళు ₹ 26,528 కోట్లలో ఇవి 50 శాతంగా ఉన్నాయి (***అనుబంధం 2.1***).

ఇందులో ₹ 9,785 కోట్ల మిగులు (37 శాతం) ఏడు గ్రాంట్లలోనే ఏర్పడింది. ఈ గ్రాంటులన్నింటిలోనూ మిగుళ్ళు ₹ 500 కోట్లు దాటిపోయి, వ్యయంలో 20 శాతంకన్నా ఎక్కువగా ఉండటంతో ఇది బడ్జెట్ ప్రతిపాదనల్లోని ఖచ్చితత్వంపై సందేహాలు రేకెత్తిస్తోంది. ఈ వివరాలు పట్టిక **2.2** లో ఉన్నాయి.

**పట్టిక 2.2 : అధికంగా మిగుళ్ళు ఏర్పడిన గ్రాంట్లు**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య | గ్రాంటు పేరు | మొత్తం గ్రాంటు | ఖర్చు | మిగుళ్ళేర్పడటానికి కారణాలు |
|---|---|---|---|---|---|
| రెవెన్యూ - ఓటు చేసింది | | | | | |
| 1 | V | రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, రిలీఫ్ | 4,370 | 2,663 | • ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం<br>• పరిపాలనాపరమైన ఆదేశాలు జారీకానందు వల్ల పనులను ప్రారంభించకపోవడం<br>• కాంట్రాక్టు ఉద్యోగుల కొనసాగింపునకు ఉత్తర్వులు ఆలస్యంగా అందడం<br>• బడ్జెట్ విడుదల ఉత్తర్వులు అందకపోవడం<br>• యూనిట్ల నుండి విజ్ఞాపనలు అందకపోవడం |
| 2 | XIII | ఉన్నత విద్య | 2,984 | 2,322 | |
| 3 | XVII | పురపాలక, పట్టణాభివృద్ధి | 4,802 | 2,482 | |
| 4 | XXI | సాంఘిక సంక్షేమం | 2,625 | 2,042 | |
| 5 | XXXI | పంచాయతీరాజ్ | 5,165 | 3,311 | |
| క్యాపిటల్ - ఓటు చేసింది | | | | | |
| 6 | XI | రోడ్లు, భవనాలు, ఓడ రేవులు | 3,915 | 2,418 | • ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం<br>• పరిపాలనా పరమైన ఉత్తర్వులు రాని కారణంగా పనులు ప్రారంభించకపోవడం<br>• భూసేకరణ చేయకపోవడం |
| 7 | XXXIV | చిన్నతరహా నీటి పారుదల | 2,317 | 1,155 | |

*మూలం : వినిమయ పద్దులు 2012-13*

అంతేకాక, ఈ దిగువ పేర్కొన్న ఒక అప్రోప్రియేషన్, మూడు గ్రాంట్లలో మిగుళ్ళు 20 శాతంలోపే ఉన్నాగానీ ₹ 1,000 కోట్లకు పైగా భారీ మిగుళ్ళు ఏర్పడ్డాయి.

**పట్టిక 2.3 : ₹ 1,000 కోట్లకు మించిన మిగుళ్ళు**

| గ్రాంటు నెంబరు | గ్రాంటు/అప్రోప్రియేషన్ పేరు | మిగులు (₹ కోట్లలో) | మిగుళ్ళకు కారణాలు |
|---|---|---|---|
| IX | ద్రవ్య పాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు - ప్రజా ఋణం (లోన్లు - చార్జి చేసినది) | 1,137 | • వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులను వినియోగించుకోకపోవడం |
| XII | పాఠశాల విద్య (రెవెన్యూ - ఓటు చేసినది) | 2,243 | • ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం<br>• పరిపాలనా పరమైన అనుమతులు, మంజూరీలు రానికారణంగా పనులను ప్రారంభించకపోవడం<br>• భూసేకరణ జరగకపోవడం<br>• పునరావాసం - పునర్నిర్మాణాలకు పరిహారం చెల్లించకపోవడం |
| XXXIII | భారీ, మధ్యతరహా నీటి పారుదల (రెవెన్యూ - ఓటు చేసినది) | 1,010 | |
| XXXIII | భారీ, మధ్యతరహా నీటి పారుదల (క్యాపిటల్ - ఓటు చేసినది) | 1,966 | |

*మూలం : వినిమయ పద్దులు 2012-13*

## 2.4.2 నిరంతరం మిగుళ్లేర్పడటం

పది కేసుల్లో, గత ఐదేళ్ళలో ప్రతి కేసులోనూ ₹ 20 కోట్ల కంటే ఎక్కువగానూ, మొత్తం గ్రాంటు/అప్రోప్రియేషన్‌లో 20 శాతం లేదా అంతకంటే ఎక్కువగా నిరంతర మిగుళ్లేర్పడ్డాయి. వివరాలను ఈ కింది పట్టికలో ఇవ్వడం జరిగింది:

**పట్టిక 2.4 : 2008-13 మధ్యకాలంలో ప్రతిఏటా మిగుళ్లేర్పడిన గ్రాంట్లు, అప్రోప్రియేషన్లు**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు/అప్రోప్రియేషన్ సంఖ్య, పేరు | మిగుళ్ళ మొత్తం | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 |
| రెవెన్యూ - ఓటు చేసినది | | | | | | |
| 1. | XVIII - గృహ నిర్మాణం | 802 | 374 | 189 | 436 | 239 |
| 2. | XXXIV -చిన్న నీటిపారుదల | 289 | 270 | 113 | 161 | 186 |
| 3. | XXXVI - పరిశ్రమలు, వాణిజ్యం | 288 | 582 | 389 | 478 | 313 |
| 4. | XXXVII - పర్యాటకం, కళలు, సంస్కృతి | 55 | 38 | 41 | 73 | 53 |
| క్యాపిటల్ - ఓటు చేసినది | | | | | | |
| 5. | V - రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పునరావాసం | 60 | 23 | 101 | 91 | 241 |
| 6. | XVI- వైద్యం, ఆరోగ్యం | 62 | 32 | 38 | 36 | 64 |
| 7. | XXI - సాంఘిక సంక్షేమం | 434 | 102 | 75 | 114 | 196 |
| 8. | XXIII - వెనుకబడిన తరగతుల సంక్షేమం | 31 | 21 | 25 | 25 | 98 |
| 9. | XXXIV - చిన్న నీటిపారుదల | 670 | 430 | 838 | 758 | 1,162 |
| క్యాపిటల్ - ఛార్జి చేసినది | | | | | | |
| 10. | XXXIII - భారీ, మధ్యతరహా నీటిపారుదల | 112 | 97 | 56 | 43 | 88 |

*మూలం : వినిమయ పద్దులు*

నిరంతరం మిగుళ్ళేర్పడటానికి ప్రభుత్వం తెలిపిన కారణాలను ఈ కింద పేర్కొనడమైంది.

***చిన్న నీటి పారుదల :*** పనుల పురోగతి నెమ్మదించటం, నిర్వహణ పనులు కొన్ని వాయిదా వేయటం, అనుమతులు రాకపోవటం, ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం, బిల్లులు/ప్రభుత్వ మంజూరీలు రాకపోవడం, పరిపాలనాపరమైన కారణాల వలన నిధులు విడుదల కాకపోవడం మొదలైనవి.

*పరిశ్రమలు, వాణిజ్యం* : ఉద్యోగాలలో ఖాళీలు భర్తీ చేయకపోవటం, భారత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, పరిశ్రమలకివ్వాల్సిన విద్యుత్తు సబ్సిడీ ఖరారు కాకపోవటం, పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను ఖరారు చేయకపోవటం, అధికారుల నుండి మంజూరీలు రాకపోవడం, సంబంధిత ఏజన్సీల నుండి బిల్లులు రాకపోవడం.

*పర్యాటకం, కళలు, సంస్కృతి* : పరిపాలనా పరమైన అనుమతులు రాని కారణంగా పనులు మొదలుపెట్టకపోవడం, నిధులు విడుదల కాకపోవడం, మంజూరీలు రాకపోవడం, కడప, నెల్లూరు జిల్లాల్లో శిల్పారామం ఏర్పాటు, బహుళ ప్రయోజనాల సాంస్కృతిక సముదాయాల నిర్మాణానికి నిధుల కేటాయింపునకు పరిపాలనా అనుమతులు రాకపోవడం.

*రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, రిలీఫ్* : పరిపాలనా పరమైన అనుమతులు రానికారణంగా పనులు మొదలుపెట్టకపోవడం, పనులకు మంజూరీలు రాకపోవడం, పనుల పురోగతి నెమ్మదించటం, పనులకు టెండర్లను మళ్ళీ పిలవడం, కొనుగోళ్ళు కొద్దిగానే చేయడం, మొదలైనవి.

*వైద్యం, ఆరోగ్యం* : పరిపాలనా పరమైన అనుమతులు రానికారణంగా పనులు మొదలుపెట్టకపోవడం,పనుల పురోగతి మందగించటం, నిర్మాణ పనులు చేపట్టే సంస్థలను ఖరారు చేయకపోవటం, పరిపాలనా పరమైన కారణాలతో కొన్ని పనులను వాయిదా వేయడం, ఆర్థిక సంవత్సరం చివర్లో బిల్లులను ఆమోదించకపోవడం.

*సాంఘిక సంక్షేమం* : పరిపాలనా పరమైన అనుమతులు రానికారణంగా పనులు మొదలుపెట్టకపోవడం, ఆర్ఐడీఎఫ్ కింద మంజూరైన పనులు లేకపోవడం, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటం, పనులలో మందగమనం, కొన్ని పనులను వాయిదా వేయడం, మొదలైనవి.

*వెనుకబడిన తరగతుల సంక్షేమం* : పరిపాలనా పరమైన అనుమతులు రానికారణంగా పనులు మొదలుపెట్టకపోవడం, పనుల పురోగతి నెమ్మదించటం, పనులకు మంజూరీలు రాకపోవడం, మొదలైనవి.

*భారీ, మధ్యతరహా నీటిపారుదల* : కోర్టు వ్యాజ్యాలు, భూసేకరణ వ్యవహారాలు పరిష్కారం కాకపోవడం, పాలనాపరమైన అనుమతులలో జాప్యం, మొదలైనవి కారణాలు.

పైన పేర్కొన్న గ్రాంట్లు గృహనిర్మాణం, నీటిపారుదల, వైద్యం-ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లోని అభివృద్ధి పథకాలకు సంబంధించినవి కాబట్టి, లక్షిత లబ్ధిదారులకు ఆశించిన ప్రయోజనాలు అందేలా చూసేందుకు సకాలంలో క్లియరెన్సులు, మంజూరీలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోలేకపోయిందని స్పష్టమవుతోంది.

### 2.4.3 అధిక ఖర్చు

బడ్జెట్ కేటాయింపులను మించి చేసిన అధిక ఖర్చులు 2011-12లో ₹ 189 కోట్లు కాగా, అది 2012-13లో ₹ 276 కోట్లకు పెరిగింది. ఐదు గ్రాంట్లు[5], ఒక అప్రోప్రియేషన్[6]లో ఈ ఏడాదిలో చేసిన అధిక వ్యయం భారత రాజ్యాంగంలోని 205వ అధికరణం ప్రకారం క్రమబద్ధీకరించాల్సి ఉంది. మూడు కేసుల్లో, ప్రతీ కేసులోనూ కేటాయించిన నిధుల కంటే ₹ 20 కోట్లు లేదా అంతకంటే అధికంగా ఖర్చు జరిగింది. ఆ వివరాలు ఈ దిగువ పట్టికలో ఉన్నాయి.

[5] X - హోం పరిపాలన (రెవెన్యూ - ఓటు చేసినది) ₹ 167,96,12,663, XI - రోడ్లు, భవనాలు, పోర్టులు (రెవెన్యూ ఓటు చేసినది) ₹ 57,53,86,220, XVII - మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (క్యాపిటల్ - ఓటు చేసినది) ₹ 191,20,051, XXIX - అడవులు, శాస్త్ర సాంకేతిక మరియు పర్యావరణం (క్యాపిటల్ - ఓటు చేసినది) ₹ 38,29,958, XXXIX - ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్లు (రెవెన్యూ - ఓటు చేసినది) ₹ 48,83,22,796

[6] XVI - వైద్యం, ఆరోగ్యం (రెవెన్యూ - ఛార్జి చేసినది) ₹ 7,741

**పట్టిక 2.5 : అధిక ఖర్చు**

(₹ కోట్లలో)

| గ్రాంటు సంఖ్య | గ్రాంటు పేరు | మొత్తం గ్రాంటు | ఖర్చు | అధిక ఖర్చుకు కారణాలు |
|---|---|---|---|---|
| **X** | ఆంతరంగిక పరిపాలన (రెవెన్యూ - ఓటు చేసినది) | 4,754 | 4,921 | • బకాయిల్లో ఉన్న బిల్లుల క్లియరెన్సు<br>• ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేయడం<br>• లీగల్ ఇంటర్‌సెప్షన్ మానిటరింగ్ సిస్టంను విస్తరించడం |
| **XI** | రోడ్లు, భవనాలు, ఓడరేవులు (రెవెన్యూ - ఓటు చేసినది) | 1,960 | 2,018 | అధిక ఖర్చుకు నిర్దిష్ట కారణాలను ప్రభుత్వం తెలుపలేదు |
| **XXXIX** | ఇన్ఫర్మేషన్ టెక్నాలజి, కమ్యూనికేషన్లు (రెవెన్యూ - ఓటు చేసినది) | 150 | 199 | |
| | మొత్తం | **6,864** | **7,138** | |

*మూలం : వినిమయ పద్దులు 2012-13*

## 2.4.4 కేటాయింపులు లేకుండా ఖర్చు చేయడం/ రీఅప్రోప్రియేషన్ ద్వారా ఖర్చు చేయడం

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్‌లోని పేరాలు 17.3.1, 17.6.1(సి) ప్రకారం, సాధారణంగా, నిధుల కేటాయింపు జరగకుండా ఏదైనా పథకం/సేవపై ఖర్చు చేయకూడదు. ఐతే, 2012-13 సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపులు లేకుండానే ఏడు కేసుల్లో మొత్తం ₹ 684 కోట్లు (ఒక్కొక్క కేసులోనూ ₹ 10 కోట్లు అంతకంటే అధికంగా) ఖర్చు చేసారు. వివరాలు పట్టిక **2.6** లో ఉన్నాయి. ఈ కేసులన్నింటిలోనూ బడ్జెట్ కేటాయింపులు (తొలి లేదా అనుబంధ కేటాయింపులు) లేవు. రీఅప్రోప్రియేషన్ చేసిన నిధుల నుండి ఖర్చు చేయడమైంది. అంతేకాక, రెండు సందర్భాల్లో (క్రమ సంఖ్యలు 2, 7) రీఅప్రోప్రియేషన్ కూడా లేకుండానే ఖర్చు చేసారు. ఇది శాసన సభ నియంత్రణనూ, బడ్జెట్ ప్రక్రియ మాన్యతనూ అతిక్రమించే చర్య.

**పట్టిక 2.6 : 2012-13 లో కేటాయింపులు లేకుండానే చేసిన ఖర్చులు**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య, పేరు | పద్దు | రీఅప్రోప్రియేషన్ | ఖర్చు |
|---|---|---|---|---|
| 1 | IX - ద్రవ్య పాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు | 2071-01-110-(09) పురపాలక సంఘాలు/ నగరపాలక సంస్థల సిబ్బందికి పెంఛన్లు | 57.25 | 57.25 |
| 2 | XI - రోడ్లు, భవనాలు, ఓడరేవులు | 3054-04-797-(04) కేంద్ర రోడ్డు నిధి నుండి ఆర్థిక సాయం | 0 | **163.41** |
| 3 | XI - రోడ్లు, భవనాలు, ఓడరేవులు | 3054-04-800-(13) ఆంధ్రప్రదేశ్ రోడ్ల అభివృద్ధి సంస్థ కింద ప్రధాన రహదార్ల అనుసంధానం | 300.00 | 297.67 |
| 4 | XVI - వైద్యం - ఆరోగ్యం | 2210-03-103-(06) సామాజిక ఆరోగ్య పోషణ సమూహాలు | 126.03 | 126.03 |
| 5 | XXXI - పంచాయతీరాజ్ | 2215-01-102-(06) పథకం అమలుకు మద్దతు | 0.01 | **11.73** |
| 6 | XXXI - పంచాయతీరాజ్ | 2215-01-102-(07) మౌలిక వసతులు అభివృద్ధి | 12.61 | 12.81 |
| 7 | XXXIX - ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్లు | 3451-00-090(30) జాతీయ ఇ- పాలన కార్యాచరణ ప్రణాళిక | 0 | **15.18** |
| | | మొత్తం | **495.90** | **684.08** |

*మూలం : వినిమయ పద్దులు 2012-13*

### 2.4.5 గత సంవత్సరాల్లో కేటాయింపులను మించి చేసిన ఖర్చుల్లో ఇంకా క్రమబద్ధీకరించాల్సినవి

భారత రాజ్యాంగంలోని 205 వ అధికరణం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం ఒక గ్రాంటు/అప్రోప్రియేషన్ కంటే అధికంగా చేసిన ఖర్చును ఆ రాష్ట్ర శాసనసభలో క్రమబద్ధీకరించుకోవాలి. అలా క్రమబద్ధీకరించుకోవడానికి ఎటువంటి గడువునూ ఈ అధికరణంలో నిర్దేశించకపోయినప్పటికీ, ప్రజా పద్దుల సంఘం (పీఏసీ) అప్రోప్రియేషన్ అకౌంట్లపై చర్చ పూర్తిచేసిన తరువాత ఈ ఖర్చులను క్రమబద్ధీకరించడం జరగాలి. ఐతే, సంబంధిత పరిపాలనా శాఖలు, ఆర్థిక శాఖ వివరణాత్మక నివేదికలు ఇవ్వని కారణంగా 2004-12 మధ్య సంవత్సరాల్లో కేటాయింపులను మించి ఖర్చు చేసిన **₹ 2,876** కోట్లు 2013 జూలై నాటికి ఇంకా క్రమబద్ధీకరించాల్సి ఉంది. ఆ వివరాలు ***అనుబంధం 2.2*** లో ఉన్నాయి.

*అదనపు వ్యయాన్ని క్రమబద్ధీకరించటం కోసం వివరణాత్మక నివేదికలు పంపమని అన్ని శాఖలనూ 2013 జూన్‌లో ఆదేశించినట్లు ప్రభుత్వం తెలిపింది (2013 డిశంబరు).*

### 2.4.6 అనవసరంగానూ, అరకొరగానూ, అధికంగానూ చేసిన అనుబంధ కేటాయింపులు

ఈ సంవత్సరం 37 కేసుల్లో, ఒక్కొక్కదాంట్లోను కోటి రూపాయలు, అంతకు మించి చేసిన అనుబంధ కేటాయింపులు అనవసరమని తేలింది. వాస్తవ వ్యయం (₹ 48,705 కోట్లు) తొలుత కేటాయించిన నిధులు (₹ 60,802 కోట్లు) కన్నా కూడా తక్కువ కావటం వలన ఈ కేసుల్లో చేసిన మొత్తం ₹ 3,577 కోట్ల అనుబంధ కేటాయింపులూ అనవసరమని తెలుస్తోంది. వివరాలు ***అనుబంధం 2.3(ఎ)*** లో ఉన్నాయి. నెలవారీ వ్యయనియంత్రణ యంత్రాంగం ద్వారా ఖర్చుల పర్యవేక్షణ సరిగా లేని కారణంగా, ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలానికి వాస్తవంగా అవసరమైన నిధులెంతనే విషయంలో సీసీఓలకు అవగాహన లేకపోవడాన్ని ఇది సూచిస్తోంది.

అదేవిధంగా, 16 కేసులలో, 13 గ్రాంట్లకు సంబంధించి, ప్రతి కేసులోనూ కోటి రూపాయలు, అంతకంటే అధికంగా చేసిన ₹ 7,167 కోట్ల అనుబంధ కేటాయింపుల్లో, అవసరమైనది ₹ 2,756 కోట్లు కాగా, ₹ 4,411 కోట్లు అధికంగా చేసినట్లు తేలింది. ఈ వివరాలు ***అనుబంధం 2.3(బి)*** లో ఉన్నాయి. రెండు కేసులలో ప్రతి కేసులోనూ కోటి రూపాయలు కంటే అధికంగా, మొత్తం ₹ 225.88 కోట్ల అనుబంధ కేటాయింపు చేసినప్పటికీ, మరో ₹ 224.51 కోట్లు అధికంగా ఖర్చయ్యాయి కాబట్టి, ఆ అనుబంధ కేటాయింపులు సరిపోలేదని తేలింది. వివరాలు ***అనుబంధం 2.3 (సి)***లో ఉన్నాయి.

వివిధ ప్రభుత్వ శాఖల్లో అనవసరంగా/అధికంగా చేసిన అనుబంధ కేటాయింపులలో ముఖ్యమైన వాటిని ఈ కింద పేర్కొనడమైంది.

**పట్టిక 2.7: అనవసరపు/అధిక అనుబంధ గ్రాంట్లు**

(₹ కోట్లు)

| క్రమ సంఖ్య | గ్రాంటు సంఖ్య | గ్రాంటు పేరు | తొలి కేటాయింపు | అసలు వ్యయం | మిగులు(-)/ అదనం(+) | అనుబంధ కేటాయింపు |
|---|---|---|---|---|---|---|
| | *రెవెన్యూ - ఓటు చేసినది* | | | | | |
| | *అనవసరపు అనుబంధ కేటాయింపులు* | | | | | |
| 1 | XII | పాఠశాల విద్య | 15,212.63 | 13,042.15 | (-) 2,170.48 | 72.40 |
| 2 | XVI | వైద్యం - ఆరోగ్యం | 5,643.18 | 5,126.61 | (-) 516.57 | 212.74 |
| 3 | XVII | పురపాలక, పట్టణాభివృద్ధి | 4,530.01 | 2,481.79 | (-) 2,048.22 | 271.83 |
| 4 | XXXI | పంచాయతీరాజ్ | 5,027.83 | 3,311.27 | (-) 1,716.56 | 136.78 |
| 5 | XXXVIII | పౌరసరఫరాల పరిపాలన | 3,299.50 | 2,792.37 | (-) 507.13 | 111.91 |
| | *అధికంగా చేసిన అనుబంధ కేటాయింపులు* | | | | | |
| 6 | V | రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పునరావాసం | 2,318.87 | 2,662.48 | 343.61 | 2,051.00 |
| 7 | IX | ద్రవ్యపాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు | 12,935.54 | 13,526.38 | 590.84 | 1,108.78 |
| 8 | XXXII | గ్రామీణాభివృద్ధి | 5,064.73 | 5,175.01 | 110.28 | 1,000.66 |
| 9 | XXXV | ఇంధనం | 5,554.55 | 6,219.98 | 665.43 | 1,178.44 |

*మూలం : వినిమయ పద్దులు 2012-13*

### 2.4.7 అనవసరంగా చేసిన పునః కేటాయింపులు

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్‌లోని పేరా 17.4 ప్రకారం, ఏదైనా ఒక గ్రాంటులోని, ఒక అంశంలో మిగిలిపోతాయని ముందుగా ఊహించిన నిధులను అదే గ్రాంటులో అదనపు నిధులు అవసరమైన మరో అంశానికి బదిలీ చేయటాన్ని పునః కేటాయింపు (రీ-అప్రోప్రియేషన్) అంటారు. 2012-13 సంవత్సరానికి 47 కేసులలో, నిధులను అధికంగానో, అనవసరంగానో, అసమగ్రంగానో రీ-అప్రోప్రియేషన్ చేయటం జరిగింది. దీనివలన నిధులను వినియోగించకపోవటంగానీ కేటాయింపులకంటే అధికంగా ఒక్కొక్క కేసులోనూ ₹ 10 కోట్లు, అంతకుమించి ఖర్చు చేయటంగానీ జరిగింది. ఈ వివరాలు ***అనుబంధం 2.4*** లో ఉన్నాయి.

### 2.4.8 వివరణలు లేని పునః కేటాయింపులు

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్‌లోని పేరా 17.17.2 ప్రకారం, అదనపు ఖర్చు లేదా మిగులుకు గల కారణాలను రీ-అప్రోప్రియేషన్ స్టేట్‌మెంట్లలో వివరించాల్సి ఉంది. 'వాస్తవ అవసరాలు/ఖర్చుల ఆధారంగా', 'ఊహించిన మిగులు', 'పొదుపు చర్యలు పాటించడం వలన', 'తొలి కేటాయింపు సరిపోదని లేదా అధికంగా ఉందని తేలింది', 'వాస్తవ పురోగతిని బట్టి' వంటి అస్పష్టమైన కారణాలను తెలుపకూడదు. ఐతే, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పునః కేటాయింపు ఆదేశాలను పరిశీలించగా, 16,171 అంశాలకుగాను 12,450 పునః కేటాయింపులలో (77 శాతం) నిర్దిష్ట కారణాలను ప్రధాన మహాగణకాధికారి (ఏ అండ్ ఇ) కార్యాలయానికి తెలపలేదని వెల్లడైంది.

### 2.4.9 పెద్ద మొత్తంలో నిధులను తిరిగి అప్పగించడం

232 ఉప పద్దుల విషయంలో, ప్రతి కేసులోనూ ₹ 10 కోట్లకంటే అధికంగానూ, మొత్తం కేటాయింపులో 50 శాతం కంటే ఎక్కువగానూ నిధులను తిరిగి అప్పగించటం (సరెండరు చేయడం) జరిగింది. ఈ విధంగా సరెండరు చేసిన మొత్తం ₹ 15,394 కోట్లు కాగా, వీటిలోని 79 ఉప పద్దులలో, నూటికి నూరు శాతం కేటాయింపులను (₹ 6,239 కోట్లను) సరెండరు చేశారు. వంద కోట్ల రూపాయల కంటే ఎక్కువగానూ, కేటాయించిన నిధుల్లో 90 శాతానికంటే అధికంగానూ సరెండరు చేసిన కేసుల వివరాలను ***అనుబంధం 2.5*** లో ఇవ్వడమైంది. ఈ కేసులలో, ప్రభుత్వం తన అవసరాలను మరింత వాస్తవికంగా అంచనా వేసి ఉండాల్సింది.

### 2.4.10 గంపగుత్తగా కేటాయించడం

బడ్జెట్ అంచనాల్లో గంపగుత్త కేటాయింపులు చేయరాదని బడ్జెట్ మాన్యువల్‌లోని పేరా 13.12 లో నిర్దేశించడం జరిగింది. ఐతే, ఇందుకు విరుద్ధంగా, ₹ 538 కోట్ల మొత్తాన్ని బడ్జెట్లో గంపగుత్తగా కేటాయించగా, ఈ ఏడాది ముగిసేనాటికి ఇందులో ₹ 299 కోట్ల నిధులు (56 శాతం) వినియోగం కాకుండా మిగిలి పోయాయి. దీనికి సంబంధించిన వివరాలు ఈ దిగువ పట్టికలో ఉన్నాయి.

**పట్టిక 2.8: గంపగుత్త కేటాయింపులు**

(₹ కోట్లలో)

| వరుస సంఖ్య | గ్రాంటు సంఖ్య, పేరు | పద్దు | బడ్జెట్ కేటాయింపులు | సరెండరు చేసిన మొత్తం |
|---|---|---|---|---|
| 1 | XI - రోడ్లు, భవనాలు, ఓడరేవులు | ఎమ్‌హెచ్ 5054-04-789-75 - పీపీపీ ప్రాజెక్టులకు గంపగుత్త కేటాయింపు | 56.70 | 56.70 |
| 2 | | ఎమ్‌హెచ్ 5054-04-796-75 - పీపీపీ ప్రాజెక్టులకు గంపగుత్త కేటాయింపు | 23.10 | 23.10 |
| 3 | | ఎమ్‌హెచ్ 5054-04-800-75 - పీపీపీ ప్రాజెక్టులకు గంపగుత్త కేటాయింపు | 270.20 | 31.66 |
| 4 | XII - పాఠశాల విద్య | ఎమ్‌హెచ్ 2202-01-800-75 - గంపగుత్త కేటాయింపు | 15.05 | 15.05 |
| 5 | XIII - ఉన్నత విద్య | ఎమ్‌హెచ్ 2202-03-001-75 - గంపగుత్త కేటాయింపు | 43.14 | 43.14 |
| 6 | | ఎమ్‌హెచ్ 2202-03-102-41- యూజీసీ వేతన స్కేళ్ళ కోసం అదనంగా చెల్లించడానికి ఒప్పుకున్న మొత్తానికి గంపగుత్త కేటాయింపు (01.01.2006 నుండి 31.03.2010 వరకు యూజీసీ వేతన స్కేళ్ళ బకాయిల్లో 20 శాతం ) | 74.00 | 74.00 |

| వరుస సంఖ్య | గ్రాంటు సంఖ్య, పేరు | పద్దు | బడ్జెట్ కేటాయింపులు | సరెండరు చేసిన మొత్తం |
|---|---|---|---|---|
| 7 | | ఎమ్‌హెచ్ 2202-03-102-75 - గంపగుత్త కేటాయింపు | 42.85 | 42.85 |
| 8 | | ఎమ్‌హెచ్ 2202-03-104-75 - గంపగుత్త కేటాయింపు | 4.92 | 4.92 |
| 9 | XVI - వైద్యం, ఆరోగ్యం | ఎమ్‌హెచ్ 2210-01-001-75 - గంపగుత్త కేటాయింపు | 7.92 | 7.92 |
| | | మొత్తం | **537.88** | **299.34** |

*మూలం : వినిమయ పద్దులు 2012-13*

పైన పేర్కొన్న వివరాల నుండి, నాలుగు గ్రాంట్ల కింద ఉన్న తొమ్మిది ఉప పద్దులకుగాను ఎనిమిది ఉప పద్దులలో కేటాయించిన నిధులు అసలు వినియోగం కాలేదని తెలుస్తోంది. మూడు ఉప పద్దులకు (క్రమ సంఖ్యలు 1 నుండి 3) సంబంధించి, బడ్జెట్‌లో కేటాయించిన ₹ 111 కోట్ల నిధులను ఆర్థిక సంవత్సరం చివరి రోజున సరెండరు చేశారు. పరిపాలనాపరమైన ఉత్తర్వులు రానందున పనులు మొదలుపెట్టకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. క్రమసంఖ్యలు 4,5,7,8,9 లో పేర్కొన్న ఉప పద్దుల కింద కేటాయించిన మొత్తం నిధులను సరెండరు చేయడానికి కారణం రెగ్యులర్ జీతాలకు, జీతాల సహాయక గ్రాంట్లకు చాలినంత బడ్జెట్ కేటాయింపు ఉండటమేనని పేర్కొన్నారు. క్రమసంఖ్య 6లో పేర్కొన్న ఉప పద్దు కింద కేటాయించిన మొత్తాన్ని సరెండరు చేయడానికి నిర్దిష్ట కారణాలను తెలపలేదు.

*ఈ విషయాన్ని పరిశీలిస్తున్నామనీ, 2013-14 బడ్జెట్‌లో గంపగుత్త కేటాయింపులు తగ్గించామనీ ప్రభుత్వం బదులిచ్చింది (2013 డిసెంబరు).*

### 2.4.11 వాస్తవ మిగుళ్ళకంటే అధికంగా నిధులను సరెండర్ చేయడం

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్ లోని పేరా 17.2.2 ప్రకారం ఏవైనా గ్రాంట్లు/అప్రోప్రియేషన్లలో మిగుళ్ళు ఏర్పడతాయని ముందుగానే తెలిస్తే ఆ నిధులను ఖర్చుచేసే శాఖలు అలాంటి మిగుళ్ళను వెంటనే ఆర్థిక శాఖకు తిరిగి అప్పగించాలి. సంబంధిత నియంత్రణాధికారులు, నిధులు మిగులుతాయని ఊహించి, సరెండర్ చేసిన తర్వాత మళ్ళీ ఖర్చు చేయటం వలన ఆయా గ్రాంటు/అప్రోప్రియేషన్‌లలో వాస్తవంగా ఏర్పడిన మిగులుకంటే అధిక మొత్తాన్ని సరెండర్ చేసినట్లవుతోంది. 19 కేసులలో, వాస్తవంగా మిగిలిన మొత్తంకన్నా సరెండర్ చేసిన మొత్తం (ప్రతి కేసులోనూ ₹ 50 లక్షలు లేదా అంతకుమించి) ఎక్కువగా ఉంది. ఇది ప్రభుత్వ శాఖలలో బడ్జెట్ నియంత్రణ, పర్యవేక్షణలు లోపించటాన్ని సూచిస్తోంది. వాస్తవంగా ఏర్పడిన మిగుళ్ళు ₹ 3,021 కోట్లు కాగా ₹ 3,388 కోట్లను (₹ 367 కోట్లు అధికంగా) సరెండర్ చేసారు. వివరాలు **అనుబంధం 2.6** లో ఉన్నాయి.

మూడు గ్రాంట్లలో, ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అంతిమంగా అధిక ఖర్చు నమోదయినందున ఈ గ్రాంట్ల నుండి ₹ 406.27 కోట్లు సరెండర్ చేయడం సరైనది కాదు. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**పట్టిక 2.9: అనాలోచితంగా చేసిన సరెండర్లు**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | గ్రాంటు/అప్రోప్రియేషన్ సంఖ్య, పేరు | మొత్తం గ్రాంటు/ అప్రోప్రియేషన్ | ఖర్చు | అధిక ఖర్చు | సరెండర్ చేసిన మొత్తం |
|---|---|---|---|---|---|
| రెవెన్యూ ఓటు చేసినది | | | | | |
| **1** | X హోమ్ పాలన | 4,754.40 | 4,921.36 | 166.96 | 237.52 |
| **2** | XI రోడ్లు, భవనాలు, ఓడరేవులు | 1,960.01 | 2,017.55 | 57.54 | 168.74 |
| క్యాపిటల్ ఓటు చేసినది | | | | | |
| **3** | XXIX అడవులు, శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం | 0.61 | 0.99 | 0.38 | 0.01 |
| | మొత్తం | **6,715.02** | **6,939.90** | **224.88** | **406.27** |

*మూలం : వినిమయ పద్దులు 2012-13*

### 2.4.12 మిగుళ్ళను అప్పగించకపోవడం

2012-13 సంవత్సరం ముగిసే నాటికి, ఐదు గ్రాంట్లు, మూడు అప్రోప్రియేషన్లలో మొత్తం ₹ 248 కోట్లు మిగిలి పోయినా సంబంధిత ప్రభుత్వ శాఖలు వాటిని సరెండరు చేయలేదు **(*అనుబంధం 2.7*).** అదే విధంగా, 22 గ్రాంట్లు, ఒక అప్రోప్రియేషన్ కింద ₹ 18,707 కోట్ల మిగుళ్ళు ఏర్పడగా, ₹ 1,342 కోట్ల మిగుళ్ళను (ప్రతి కేసులోనూ ₹ ఐదు కోట్లు అంతకుమించి ఉన్నవి) సరెండరు చేయలేదు. మొత్తం మిగుళ్ళ (₹ 26,528 కోట్లు) లో ఇవి ఐదు శాతం ఉన్నాయి. ఈ వివరాలు ***అనుబంధం 2.8*** లో ఉన్నాయి.

అంతేకాకుండా, 92 కేసులలో (ప్రతి కేసులోనూ ₹ 10 కోట్ల కంటే ఎక్కువ నిధులను సరెండరు చేసిన కేసులు), ₹ 25,276 కోట్లు (మొత్తం ₹ 26,528 కోట్ల మిగుళ్ళలో 95 శాతం) ఆర్థిక సంవత్సరపు చివరి పనిదినంనాడు సరెండరు చేశారు **(*అనుబంధం 2.9*)**. వ్యయ నిర్వహణ, ఆర్థిక నియంత్రణ సరిగా లేవని దీన్నిబట్టి స్పష్టమవుతోంది.

### 2.4.13 హడావిడి ఖర్చులు

ఖర్చులు ఏడాది పొడవునా సమంగా ఉండాలనీ, ఏదైనా అప్రోప్రియేషన్ మురిగిపోకుండా ఉండేందుకు మార్చి నెలలో అనవసరపు హడావిడి ఖర్చులు చేయకూడదనీ ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లోని 39 వ అధికరణం నిర్దేశిస్తోంది. ఈ నిబంధనలకు విరుద్ధంగా, 2012 డిసెంబరుతో ముగిసిన మూడు త్రైమాసికాల్లోని ఒక్కొక్క త్రైమాసికంలోనూ, ఏడాదిలో చేసిన మొత్తం ఖర్చులో 20 నుండి 23 శాతం మధ్య చేయగా, 36 శాతం ఖర్చును చివరి త్రైమాసికంలో చేసారు. 2013 మార్చి నెలలోనే 20 శాతం ఖర్చు చేసారు. ఇది హడావిడి ఖర్చులను సూచిస్తుంది.

*కేంద్రం నుంచి నిధులు ఆర్థిక సంవత్సరం చివర్లో అందటమే మార్చి నెలలో ఖర్చులు పెరగటానికి కారణమని ప్రభుత్వం తెలిపింది (2013 డిశంబరు).*

## 2.5 ఆకస్మిక ఖర్చులనిధి నుండి అడ్వాన్సులు

భారత రాజ్యాంగపు అధికరణాలు - 267(2), 283(2) లలోని నిబంధనలను అనుసరించి, ఆంధ్రప్రదేశ్ కంటింజెన్సీ ఫండ్ చట్టం - 1957 ప్రకారం రాష్ట్ర ఆకస్మిక ఖర్చుల నిధి (కంటింజెన్సీ ఫండ్) ఏర్పాటయింది. ముందుగా ఊహించని అత్యవసరమైన ఖర్చుల కోసం మాత్రమే ఈ నిధి నుండి అడ్వాన్సులను తీసుకోవచ్చు. ఎప్పటికప్పుడు తిరిగి భర్తీ చేసే రీతిలో ₹ 50 కోట్ల నిల్వ ఉండే విధంగా ఈ నిధిని ఏర్పాటు చేసారు.

2012-13 సంవత్సరంలో ఈ నిధినుంచి మొత్తం ₹ 3.11 కోట్లను డ్రాచేసేందుకు 37 మంజూరీలను జారీ చేసారు. ఈ మంజూరీలననుసరించి ₹ 2.77 కోట్లు ఖర్చు చేసి, అందులో ₹ 0.72 కోట్లు తిరిగి భర్తీచేశారు. ఇంకా ₹ 2.05 కోట్లు భర్తీ చేయవలసి ఉంది. ఇంతేకాక, 2011-12 సంవత్సరానికి సంబంధించిన ₹ 0.21 కోట్లు కూడా ఈ సంవత్సరం భర్తీ చేశారు. రెండు మంజూరీలకు సంబంధించిన ₹ 0.16 కోట్ల మొత్తాన్ని 2012-13లోనే తిరిగి భర్తీ చేసినప్పటికీ వీటి తాలూకు ఏ ఖర్చూ నమోదు కాలేదు.

*ఆకస్మిక నిధినుంచి తీసుకున్న అడ్వాన్సులు ఈ సంవత్సరం వినియోగించుకొనకపోతే సంబంధిత శాఖలు తదుపరి సంవత్సరం సరెండర్ చేస్తాయని ప్రభుత్వం తెలిపింది (2013 డిశంబరు).*

## 2.6 ప్రధానమైన విధాన నిర్ణయాలు

సామాజిక - ఆర్థిక అభివృద్ధి కోసం, వరదలు/వర్షాభావం వల్ల ప్రభావితమైన రైతులకు సహాయం కోసం, ఇంకా మహిళాభ్యుదయం మొదలైన వాటికోసం ప్రభుత్వం ప్రతి ఏటా పలు ప్రధాన విధాన నిర్ణయాలు, పథకాలు ప్రకటిస్తుంది. 2012-13 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రసంగంలోనూ, వార్షిక ప్రణాళికలోనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన విధాన నిర్ణయాలు, పథకాలలో కొన్నింటిని మచ్చుకు తనిఖీచేసి వాటి అమలు తీరును ఆడిట్‌లో పరిశీలించడం జరిగింది. ఆడిట్‌లో కనుగొన్న అంశాల్లో ప్రధానమైన వాటిని ఈ దిగువ పేర్కొనడమైంది :

### 2.6.1 వడ్డీలేని రుణాలు[7]

i. *వ్యవసాయ శాఖ:* 2011-12 సంవత్సరపు రబీ కాలం నుండి రైతులు చెల్లించిన వ్యవసాయ రుణాలపై వడ్డీని మాఫీ చేయడానికి ప్రభుత్వం ఈ పథకం కింద ₹ 375 కోట్లను కేటాయించింది. 2011 అక్టోబరు 1 నుండి మంజూరైన రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. లక్ష రూపాయల వరకు ఇచ్చే రుణాలపై వడ్డీ ఈ పథకం కింద పూర్తిగా మాఫీ అవుతుంది. లక్ష రూపాయల నుండి మూడు లక్షల రూపాయల వరకు ఇచ్చే రుణాలపై పావలా వడ్డీ[8] వర్తిస్తుంది. ఈ పథకం మార్గదర్శకాలను, విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయని కారణంగా (2013 ఏప్రిల్ నాటికి), 14.05 లక్షల మంది రైతులకు సంబంధించి ₹ 98 కోట్ల వ్యవసాయ రుణాలపై మాఫీ క్లెయిమ్‌లు అపరిష్కృతంగా ఉన్నాయి.

ii. *గ్రామీణాభివృద్ధి శాఖ:* మహిళా స్వయం సహాయక బృందాలు తీసుకున్న బ్యాంకు రుణాలపై వడ్డీ సబ్సిడీ కల్పించేందుకు డ్వాక్రా మహిళల కోసం 'వడ్డీ లేని రుణాలు' అనే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. 2012-13 బడ్జెట్‌లో ₹ 1,303 కోట్లను కేటాయించి, 7,63,652 స్వయం సహాయక బృందాలకు ఈ పథకం వర్తింప చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం నుండి గ్రామీణాభివృద్ధి కమీషనరు ₹ 826 కోట్లను డ్రా చేసి (2012 ఏప్రిల్ నుండి 2013 మార్చి వరకు) గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పీడీ ఖాతాకు జమ చేసారు. బిల్లులు ఆమోదం పొందని కారణంగా మిగిలిన ₹ 477 కోట్లను డ్రా చేయలేదు.

### 2.6.2 పావలా వడ్డీ

పంట రుణాలను గడువులోపు చెల్లించే రైతులకు ఆర్థిక ఇబ్బందులు తొలగించే ఉద్దేశంతో ఈ రుణాలపై తక్కువ వడ్డీ (మూడు శాతం చొప్పున) వర్తింప చేస్తూ 'పావలా వడ్డీ' పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రభుత్వం, 2012-13 లో ఇందుకోసం ₹ 200 కోట్లు కేటాయించినప్పటికీ ₹ 100 కోట్లను మాత్రమే విడుదల చేసారు. బ్యాంకర్లు సమర్పించిన క్లెయిమ్‌ల ఆధారంగా ఇందులో ₹ 69 కోట్లు (35 శాతం) ఖర్చు చేసారు. మిగిలిన ₹ 31 కోట్లు 2013 జూలై నాటికి ఖర్చు కాకుండా మిగిలి ఉన్నాయి. అంతేకాక, 25.45 లక్షల మంది రైతులకు ఈ పథకాన్ని వర్తింప చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, 13.82 లక్షల రైతులకు మాత్రమే (54 శాతం) లబ్ధి చేకూర్చారు.

### 2.6.3 పాల పథకం

2010 నుండి 2014 వరకుగల నాలుగేళ్ళ వ్యవధిలో పాల ఉత్పత్తిని రోజుకు 298.01 లక్షల లీటర్ల (2010-11) నుండి రోజుకు 496.31 లక్షల లీటర్లకు పెంచాలనే (67 శాతం వృద్ధి) ఉద్దేశంతో ప్రభుత్వం తలపెట్టిన నూతన పథకమే *'రాష్ట్ర పాల పథకం'*. ఈ పథకం కింద, ఒక్కొక్క పశువు నుండి పాల ఉత్పాదకతను రోజుకు 3.8 లీటర్ల నుండి రోజుకు 4.78 లీటర్లకు పెంచాలనీ (26 శాతం వృద్ధి) పాల తలసరి లభ్యతను 269.25 గ్రాముల నుండి 426 గ్రాములకు పెంచాలని (58 శాతం వృద్ధి) కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు. 2012-13 సంవత్సరానికి సాధారణ రాష్ట్ర ప్రణాళిక కింద ₹ 50.38 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. ఐతే, ఈ పథకానికి ప్రభుత్వం నుండి తుది ఆమోదం లభించని కారణంగా బడ్జెట్ విడుదల ఉత్తర్వులు జారీ కాలేదు.

### 2.6.4 జాతీయ తుఫాను ప్రమాద నివారణ పథకం (ఎన్‌సీఎమ్‌పీ) కింద తుఫాను షెల్టర్ల నిర్మాణం

'ఎన్‌సీఎమ్‌పీ' కింద తుఫాను షెల్టర్ల నిర్మాణం కోసం 2012-13 లో ₹ 80.40 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో కేంద్ర వాటా ₹ 72.40 కోట్లుకాగా, రాష్ట్ర వాటా ₹ ఎనిమిది కోట్లు. ఐతే కేంద్ర వాటా నుండి ₹ 4.72 కోట్లు, రాష్ట్ర వాటా నుండి ₹ 1.51 కోట్లు చొప్పున మొత్తం ₹ 6.23 కోట్లు (ఎనిమిది శాతం) మాత్రమే ఖర్చు చేసారు. ఏడు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 2013 ఆగస్టు నాటికి కేవలం రెండు పనులు మాత్రమే పూర్తయ్యాయి.

---

[7] రైతులకు వడ్డీ లేకుండా ఇచ్చే రుణాలు
[8] 25 పైసల వడ్డీ

### 2.6.5 రాజీవ్ యువకిరణాలు

విద్యాసంస్థల నుండి బయటకు వచ్చే విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు 2014 నాటికి 15 లక్షల ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యంతో 2011-12 లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన పథకం 'రాజీవ్ యువ కిరణాలు'. ఈ పథకాన్ని అమలు చేసేందుకు 'ఆంధ్రప్రదేశ్ లో రాజీవ్ విద్య, ఉపాధి మిషన్' అనే సంస్థను 2011 లో స్థాపించారు. 2012-13లో ₹ 150 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా, ₹ 113 కోట్లు (75 శాతం) మాత్రమే ఖర్చు చేసారు. ఇంకా ₹ 37 కోట్లు ఖర్చు కాకుండా మిగిలిపోయింది. 3.43 లక్షల యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, కేవలం 1.57 లక్షల మందికి (46 శాతం) మాత్రమే ఉపాధి కల్పించారు.

### 2.6.6 ఇందిర జలప్రభ

షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతుల ప్రజలకు చెందిన పది లక్షల ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు ఒక లక్ష సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలని ₹ 1800.60 కోట్ల అంచనాతో ప్రభుత్వం ఇందిర జలప్రభ పథకాన్ని ప్రవేశపెట్టింది (2011 సెప్టెంబరు[9]). ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం ఈ పథకం 2013 జనవరి నాటికి పూర్తవ్వాలి. 2013 మార్చి నాటికి 67,000 బోరుబావులు తవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, 2012-13 సంవత్సరంలో ఇందుకోసం ₹ 95 కోట్లు మాత్రమే విడుదల చేయడం వలన కేవలం 12,392 బోరుబావులు (19 శాతం) మాత్రమే తవ్వడం, 5008 బోర్లకు (ఏడు శాతం) పంపు సెట్లను బిగించడం పూర్తయింది. పది లక్షల ఎకరాలను సాగులోకి తేవాలన్న లక్ష్యానికిగానూ ఒక లక్షా నాలుగువేల ఎకరాలు మాత్రమే సాగులోకి తేవడం జరిగింది.

### 2.6.7 సమగ్ర శిశుసంరక్షణ పథకం

సంకట స్థితిలో ఉన్న పిల్లల జీవనస్థితి మెరుగుపరచేందుకు, పిల్లలపై దాష్టీకం, నిరాదరణ, శ్రమదోపిడి, కుటుంబాలకు దూరం కావడం వంటి హానికర పరిస్థితులను నివారించేందుకు ఉద్దేశించిన పథకమే 'సమగ్ర శిశు సంరక్షణ పథకం'. ఈ పథకం కోసం 2012-13 బడ్జెట్‌లో సీఎస్ఎస్ కింద ₹ 21.42 కోట్లు, ఎమ్ఎస్ఎస్ కింద ₹ 6.99 కోట్లు చొప్పున మొత్తం ₹ 28.41 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం ₹ 19.84 కోట్లు విడుదల చేయగా సంబంధిత ప్రభుత్వశాఖ ₹ 14.08 కోట్లు డ్రా చేసి ₹ 6.85 కోట్లు ఈ పథకంపై ఖర్చు చేసింది. డ్రా చేసి, ఖర్చు చేయకుండా మిగిలిన ₹ 7.23 కోట్లను, (ఇందులో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే 81 హోమ్‌ల నిర్వహణ కోసం ఉద్దేశించినది ₹ 6.23 కోట్లు) స్వల్పకాలిక డిపాజిట్లలో ఉంచారు. గత ఏడాది నిల్వలతో కలిపి మొత్తం ₹ 9.68[10] కోట్లు, 2013 మార్చినాటికి ఖర్చుకాకుండా ఉన్నాయి. వీటిలో ₹ తొమ్మిది కోట్లు స్వల్పకాలిక డిపాజిట్లలోనూ ₹ 68 లక్షలు కరెంటు ఖాతాలోనూ ఉన్నాయి.

### 2.6.8 భూభారతి

అన్ని రకాల భూములకు సంబంధించి, వాటి కొలతలు, యాజమాన్యం, వినియోగం వంటి వివరాలన్నింటినీ సమగ్రంగా డిజిటల్ రూపంలో నమోదు చేసేందుకు ప్రభుత్వం తలపెట్టిన నూతన పథకం **'భూభారతి'** అనే సమగ్ర భూముల నమోదు-నిర్వహణ పథకం. 2005 జనవరిలో నిజామాబాద్ జిల్లాలో 'పైలట్ ప్రాజెక్టు' చేపట్టి, 2013 మార్చి నాటికి ₹ 29.22 కోట్లు ఖర్చు చేసారు. ఈ ప్రాజెక్టు గడువు 24 నెలలు కాగా ప్రభుత్వం 2013 డిసెంబరు వరకు పొడిగించింది. పైలట్ ప్రాజెక్టు పూర్తి కానప్పటికీ, 2008 మార్చిలో ప్రభుత్వం ₹ 1,556 కోట్ల అంచనాతో ఈ పథకాన్ని మొత్తం రాష్ట్రమంతటికీ విస్తరించాలని నిర్ణయించింది. ఈ పథకం అమలు కోసం 2007-12 మధ్య కాలంలో ₹ 23.25 కోట్లు డ్రా చేసి, అందులో ₹ 23.08 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉంచారు. 2012-13 బడ్జెట్‌లో ఈ పథకానికి ₹ 75 కోట్లు కేటాయించి, ₹ 37.74 కోట్లు విడుదల చేసారు. ఐతే, ట్రెజరీ నుండి ఆమోదం రావడంలో జాప్యం వలన నిధులు డ్రా చేయలేకపోయారు. ఆవిధంగా, 2008 లో తలపెట్టిన భూభారతి ప్రాజెక్టును ఇంకా అమలు చేయలేకపోయారు.

---

[9] పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధిశాఖ (ఆర్‌డీ-III) 2011 సెప్టెంబరు 9న జారీ చేసిన జీఓఆర్‌టీ సంఖ్య 315

[10] ఇండియన్ బ్యాంకు, వెంగళరావునగర్, అమీర్‌పేట, హైదరాబాదు

### 2.6.9 చిన్న, మధ్యతరహా పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పథకం

జవహర్‌లాల్‌నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం (జెఎన్ఎన్‌యూఆర్ఎమ్)లో భాగంగా 'చిన్న, మధ్యతరహా పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పథకం' కోసం 2012-13 బడ్జెట్‌లో ప్రభుత్వం ₹ 825.95 కోట్లు కేటాయించింది. ఐతే, పరిపాలనా ఉత్తర్వులు రాని కారణంగా పనులు మొదలు పెట్టకపోవడం వల్ల కేటాయించిన మొత్తంలో ₹ 12.51 కోట్లు (1.5 శాతం) మాత్రమే ఖర్చు అయ్యాయి.

### 2.6.10 సమీకృత గృహనిర్మాణ, మురికివాడల అభివృద్ధి కార్యక్రమం

జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకంలో భాగంగా, 'సమీకృత గృహనిర్మాణ, మురికివాడల అభివృద్ధి పథకం' కోసం ప్రభుత్వం 2012-13 బడ్జెట్‌లో ₹ 163.20 కోట్లు కేటాయించింది. ఐతే, పరిపాలనా ఉత్తర్వులురాని కారణంగా పనులు మొదలు పెట్టకపోవడంతో ఈ పథకం కోసం ఈ ఏడాది ₹ మూడు లక్షలు మాత్రమే ఖర్చయ్యింది.

### 2.6.11 వ్యవసాయపరపతి స్థిరీకరణ నిధికి వాటా చెల్లింపు

భారీ వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా నష్టపోవడంవల్ల ఖరీఫ్ 2011, రబీ 2011-12 లకు సంబంధించిన పంట రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు ఉద్దేశించిన 'వ్యవసాయ పరపతి స్థిరీకరణ నిధి'కి భారత ప్రభుత్వం తన వాటాగా ₹ 100 కోట్లను ఆప్కాబ్[11] కు ఇచ్చింది. అయితే ఈ మొత్తాన్ని వినియోగించలేదు. అంతేకాక, 2008 నుండి భారత ప్రభుత్వం తన వాటాగా ఇచ్చిన నిధులను అస్సలు ఖర్చు చేయలేదు. 2012-13 లో ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, 2010-11, 2011-12 సంవత్సరాల్లో పరిపాలనా మంజూరీలు రాకపోవడం వల్ల నిధులు ఖర్చు చేయలేదని తెలిపారు.

### 2.6.12 వైకల్యంగల పిల్లలకు సమీకృత విద్య

ఇది కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకం. 6-14 ఏళ్ళ వయస్సుగల పిల్లలను ప్రత్యేక అవసరాలుగలవారిని సర్వశిక్షా అభియాన్ పథకం పరిధిలోకి తెచ్చి, మిగతా పిల్లలతో సమానంగా విద్యా సదుపాయం కల్పించడం ఈ పథకం లక్ష్యం. ఈ పథకం కోసం 2012-13 బడ్జెట్‌లో ₹ 109.61 కోట్లు కేటాయించినప్పటికీ, 2013 మార్చి 31 నాటికి ₹ 3.37 కోట్లు మాత్రమే ఖర్చుచేసారు.

### 2.6.13 రోడ్ల అభివృద్ధి నిధి - రాష్ట్ర కేటాయింపు పనులు

జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ఇతర రాష్ట్రాలతో అనుసంధానం చేసే రోడ్లు, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల అభివృద్ధి, రైలు మార్గాల కింద, పైన రోడ్ల నిర్మాణం, నిర్వహణ వంటి సీఆర్ఎఫ్ పనుల కోసం 2012-13 బడ్జెట్‌లో ₹ 187.65 కోట్లు కేటాయించారు. ఇందులో, ₹ 93.83 కోట్లు (50 శాతం) విడుదల చేయగా, ₹ 18.43 కోట్లు (20 శాతం) ఖర్చు చేసారు.

### 2.6.14 ఎన్ఆర్ఈజీపీ పనుల స్థాయి పెంపు

ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అభివృద్ధి చేసిన రోడ్లకోసం మన్నికగల ఆస్తుల కల్పన ఈ పథకం లక్ష్యం. ఈ పథకం కోసం, ఈ ఏడాది ₹ 100 కోట్లు కేటాయించగా, ₹ 2.31 కోట్లు మాత్రమే ఖర్చు చేసారు.

### 2.6.15 షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ఉపప్రణాళిక

2012-13 బడ్జెట్ /వార్షిక ప్రణాళికలో ప్రభుత్వం పలు ప్రధాన విధాన నిర్ణయాలను ప్రకటించింది. ఇవేకాక, షెడ్యూల్డు కులాలు (ఎస్సీ), షెడ్యూల్డు తెగల (ఎస్టీ) సత్వర అభివృద్ధి కోసం ప్రభుత్వం 2012 డిసెంబరులో ఒక చట్టాన్ని చేసింది.

[11] ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు

ఎస్సీ, ఎస్టీల భద్రత, సామాజిక గౌరవం కాపాడేలా చూసేందుకు ఆర్థిక, విద్య, మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రాగల పదేళ్ళ కాలంలో సమానత్వాన్ని సాధించేలా చూసేందుకు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు సమాన అవకాశాలను కల్పించేందుకు ఈ చట్టం ప్రాధాన్యతనిస్తుంది. ఈ సందర్భంగా, ఎస్సీ, ఎస్టీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులను ఆడిట్‌లో సమీక్షించడమైంది. ఆడిట్‌లో కనుగొన్న విషయాలు ఈ కింద చర్చించడమైంది.

ప్రభుత్వ ఆదేశాల[12] ప్రకారం ప్రభుత్వ శాఖలన్నీ తమ ప్రణాళికా వ్యయంలో కనీసం 16.2 శాతం ఎస్సీల అభివృద్ధికీ అలాగే 6.6 శాతం ఎస్టీ వారి అభివృద్ధికీ ప్రత్యేకంగా బడ్జెట్‌లో కేటాయించాలి. ఎస్సీ, ఎస్టీలకు వ్యక్తిగతంగా లేదా వారి సామాజిక వర్గం మొత్తానికి ప్రత్యక్షంగా ప్రయోజనాలందించేలా పథకాలను రూపొందించి, వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపడేలా చూసేందుకు నిధులు కేటాయించాలి.

2008-13 మధ్యగల ఐదేళ్ళ కాలంలో 'ఎస్సీల కోసం ప్రత్యేక ప్రణాళికా అంశాలు (ఎస్సీపీ)', 'గిరిజన ప్రాంతాల ఉపప్రణాళిక (టీఎస్పీ)'ల కింద బడ్జెట్ కేటాయింపు, ఖర్చుల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

**పట్టిక 2.10: ఎస్సీపీ, టీఎస్పీల కింద బడ్జెట్, ఖర్చుల వివరాలు**

(₹ కోట్లలో)

| సంవత్సరం | రాష్ట్ర బడ్జెట్ మొత్తం | ఎస్సీపీ బడ్జెట్ | రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీపీ బడ్జెట్ శాతం | ఖర్చు | టీఎస్పీ బడ్జెట్ | రాష్ట్ర బడ్జెట్‌లో టీఎస్పీ బడ్జెట్ శాతం | ఖర్చు |
|---|---|---|---|---|---|---|---|
| **2008-09** | 47,541 | 3,656 | 8 | 2,114 (58%) | 1,765 | 4 | 977 (55%) |
| **2009-10** | 43,199 | 3,376 | 8 | 2,069 (61%) | 1,469 | 3 | 967 (66%) |
| **2010-11** | 43,360 | 4,017 | 9 | 2,680 (67%) | 1,615 | 4 | 1,061 (66%) |
| **2011-12** | 51,230 | 4,921 | 10 | 3,487 (71%) | 1,969 | 4 | 1,409 (72%) |
| **2012-13** | 55,572 | 5,120 | 9 | 2,952 (58%) | 2,167 | 4 | 1,428 (66%) |

*మూలం : వినిమయ పద్దులు*

*బ్రాకెట్లలో ఉన్న అంకెలు కేటాయింపుకు ప్రతిగా చేసిన వ్యయ శాతాన్ని సూచిస్తాయి*

రాష్ట ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో, ప్రణాళికా వ్యయం కింద ఎస్సీపీ కోసం ఎనిమిది నుండి 10 శాతం, టీఎస్పీ కోసం మూడు నుండి నాలుగు శాతం మాత్రమే కేటాయించినట్లు పై పట్టికలోని వివరాలను చూస్తే తెలుస్తోంది. ఎస్సీపీ కోసం కేటాయించాల్సిన 16.2 శాతం, టీఎస్పీ కోసం కేటాయించాల్సిన 6.6 శాతం కంటే వాస్తవంగా కేటాయించినది తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాక, చేసిన కేటాయింపుల్లో ఎస్సీపీ కింద 58 నుండి 71 శాతం, టీఎస్పీ కింద 55 నుండి 72 శాతం మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేసింది.

2008-2013 మధ్య కాలంలో సాధారణ, సామాజిక, ఆర్థిక సేవల కోసం రంగాల వారీగా చేసిన కేటాయింపులు, ఖర్చుల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**పట్టిక 2.11: ఎస్సీపీ, టీఎస్పీల కింద రంగాల వారీగా బడ్జెట్ కేటాయింపు, ఖర్చు**

(₹ కోట్లలో)

| రంగం | ప్రణాళికా బడ్జెట్ మొత్తం | ఎస్సీపీ | | టీఎస్పీ | |
|---|---|---|---|---|---|
| | | కేటాయింపు | ఖర్చు | కేటాయింపు | ఖర్చు |
| *సాధారణ సేవలు* | *3061.74* | *86.29 (3%)* | *6.55 (8%)* | *35.32 (1%)* | *2.67 (8%)* |
| *సామాజిక సేవలు* | *1,06,288.03* | *12,596 (12%)* | *8,742.36 (69%)* | *5,236.59 (5%)* | *3,585.41 (68%)* |
| *ఆర్థిక సేవలు* | *1,31,552.30* | *8,406.66 (6%)* | *4,552.45 (54%)* | *3,712.38 (3%)* | *2,254.14 (61%)* |

*మూలం : వినిమయ పద్దులు*

*బ్రాకెట్లలోని అంకెలు కేటాయింపులకు ప్రతిగా మొత్తం ప్రణాళికాబడ్జెట్‌లో కేటాయింపు శాతాన్ని, వ్యయ శాతాన్ని సూచిస్తాయి*

[12] ప్రణాళిక (XVIII) శాఖ 2005 నవంబరు 7వ తేదీన జారీ చేసిన జీఓ ఎమ్ఎస్ నంబరు 17

నీటిపారుదల, వ్యవసాయం, విద్య, గృహనిర్మాణం, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖల్లో రికార్డులను మచ్చుకు తనిఖీ చేయగా ఎస్‌సీపీ, టీఎస్‌పీల కింద విడుదల చేసిన నిధులు నిర్దేశిత శాతం కన్నా తక్కువగా ఉన్నాయని వెల్లడైంది. ప్రధాన ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఈ వివరాలను ఈ కింద తెలపడమైంది:

*నీటిపారుదల శాఖ (టీఎస్‌పీ కింద)*

- గిరిజన ప్రాంతాల్లోని చిన్న తరహా నీటిపారుదల ప్రాజెక్టుల కోసం 2008-12లో కేటాయించిన ₹ 9.23 కోట్లు (కర్నూలు: ₹ 1.20 కోట్లు, మంచిర్యాల: ₹ 8.03 కోట్లు) గిరిజనేతర ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణం, బీటీ రోడ్ల నిర్మాణం కోసం మళ్ళించారు.
- ములుగులో గ్రామీణ నీటి సరఫరా పనులకోసం 2008-13 మధ్య కాలంలో ₹ 2.11 కోట్ల వ్యయం కాగల 35 ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికీ, 2013 ఫిబ్రవరి నాటికి కనీసం ఒక్క పని కూడా పూర్తవలేదు.

*పాఠశాల విద్య*

ఆరు నుండి 14 ఏళ్ళ వయసు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను కల్పించేందుకు 'సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)' పథకాన్ని ప్రవేశపెట్టారు.

- ఎస్ఎస్ఏ ద్వారా నాలుగు పథకాలను[13] అమలు చేయడానికి 2012-13లో ఎస్‌సీపీ కింద ₹ 250.04 కోట్లు, టీఎస్‌పీ కింద ₹ 101.87 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఐతే, ఎస్‌సీపీ కింద ₹ 151.72 కోట్లు, టీఎస్‌పీ కింద ₹ 58.48 కోట్లు మాత్రమే విడుదల చేసారు.
- పదకొండు పథకాల[14] అమలు కోసం ఎస్‌సీపీ కింద ₹ 248.74 కోట్లు, టీఎస్‌పీ కింద ₹ 107.36 కోట్లు కేటాయించగా, ఎస్‌సీపీ కింద ₹ 139.82 కోట్లు, టీఎస్‌పీ కింద ₹ 77.75 కోట్లు మాత్రమే ఖర్చు చేసారు.

ఈ విషయంలో ప్రభుత్వం బదులివ్వలేదు.

## 2.7 ఎంపిక చేసుకున్న గ్రాంట్లపై సమీక్ష

2012-13 సంవత్సరంలో, ఆడిట్ పరిశీలన కోసం ఇంధన గ్రాంటు, మైనార్టీ సంక్షేమ గ్రాంటులను ఎంపిక చేసుకోవడం జరిగింది. బడ్జెట్ ప్రక్రియ, నిధులపై పర్యవేక్షణ, నియంత్రణా వ్యవస్థ, ఈ గ్రాంట్ల కింది పథకాల అమలు తీరును పరిశీలించడం జరిగింది. దీనికి సంబంధించి, ఆడిట్‌లో కనుగొన్న విషయాలను ఈ కింద పేర్కొనడమైంది.

### 2.7.1 ఇంధన గ్రాంటు

రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి రంగాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ సంస్థ (ఏపీఈఆర్‌సీ) నియంత్రిస్తుండగా, ఇంధన గ్రాంటును ఇంధన శాఖ నిర్వహిస్తోంది. విద్యుత్ రంగంలోని సంస్కరణల్లో భాగంగా, ఒకప్పటి, 'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బోర్డు (ఏపీఎస్ఈబీ)'ను 'ఆంధ్రప్రదేశ్ విద్యుదుత్పాదన సంస్థ (ఏపీజెన్‌కో)', 'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ప్రసార సంస్థ (ఏపీట్రాన్స్‌కో)'గా విభజించారు. ఆ తర్వాత, 2000 ఏప్రిల్ 1 నుండి ఏపీట్రాన్స్‌కోను 'విద్యుత్ ప్రసార సంస్థ' గాను, నాలుగు 'విద్యుత్ పంపిణీ కంపెనీలు (డిస్కమ్‌లు)' గానూ విభజించారు.

---

13 కేజీబీవీ, ఎన్‌పీఈజీఈఎల్, ఎస్ఎస్ఏలకు సహాయం, పదమూడో ఆర్థిక సంఘం గ్రాంట్లు

14 డీఐఈటీల కొనసాగింపు, ఐఏఎస్ఈలు/సీటీఈల నవీకరణ, 2000 పాఠశాలల్లో ఇన్ఫర్మేషన్-కమ్యూనికేషన్ టెక్నాలజీ 5000 పాఠశాలల్లో ఇన్ఫర్మేషన్-కమ్యూనికేషన్ టెక్నాలజీ , ప్రాథమిక పాఠశాలల్లో పోషకాహార పథకం, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పోషకాహార పథకం, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షాఅభియాన్, ఆదర్శ పాఠశాలల స్థాపన, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, అధ్యయన సామాగ్రి సరఫరా, గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ విద్యార్థుల కోసం బీఎడ్, డీఎడ్ కాలేజీల స్థాపన, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు పోషకాహార పథకం

### *2.7.1.1 బడ్జెట్, ఖర్చులు*

2012-13 సంవత్సరానికి ఇంధన శాఖకు బడ్జెట్ కేటాయింపు ₹ 7,174 కోట్లు. 2008-13 మధ్య కాలంలో బడ్జెట్ కేటాయింపు, ఖర్చు, మిగుళ్ళ స్థితిని ఈ కింది పట్టికలో పేర్కొనడమైంది.

**పట్టిక 2.12: ఇంధన గ్రాంటు కింద బడ్జెట్-ఖర్చు**

(₹ కోట్లలో)

| | 2008-09 | | | 2009-10 | | | 2010-11 | | | 2011-12 | | | 2012-13 | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు |
| రెవెన్యూ | 3671 | 3660 | (-)11 | 6086 | 3250 | (-)2836 | 4550 | 3687 | (-)863 | 4363 | 4348 | (-)15 | 6733 | 6220 | (-)513 |
| క్యాపిటల్ | 0 | 0 | 0 | 20 | 10 | (-)10 | 10 | 10 | 0 | 20 | 20 | 0 | 30 | 30 | 0 |
| లోన్లు | 361 | 1 | (-)360 | 152 | 0 | (-)152 | 458 | 494 | 36 | 1475 | 1475 | 0 | 411 | 373 | (-)38 |

*మూలం : వినిమయ పద్దులు*

- రెవెన్యూ విభాగంలో కేటాయింపులు 2010-11 నుండి 2012-13 మధ్య 48 శాతం పెరిగాయి. ఈ విభాగంలో మిగుళ్ళు 2010-11 నాటి 19 శాతం నుండి క్రమంగా తగ్గుతూ, 2012-13 లో ఎనిమిది శాతంగా ఉన్నాయి. ఐతే, 2012-13లో ₹ 513.01 కోట్లు మొత్తం మిగుళ్ళలో, ₹ 508.90 కోట్లు 2013 మార్చిలో, అంటే, ఆర్థిక సంవత్సరం చివర్లో సరెండరు చేసారు. మిగుళ్ళేర్పడటం వల్ల, అదనంగా కేటాయించిన మొత్తం ₹ 117.84 కోట్లు అనవసరమని తేలింది.

- *వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్* కోసం 2004 మే నుండి **'వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ సబ్సిడీ కోసం ఏపీట్రాన్స్‌కోకు సాయం'**ను కేటాయిస్తున్నారు. 2010-13 మధ్యకాలంలో రెవెన్యూ విభాగానికి కేటాయించిన మొత్తంలో ఈ అంశంపై చేసిన కేటాయింపు 91 నుండి 99 శాతం వరకు ఉంది. ఇదే కాలంలో ఈ అంశంపై చేసిన ఖర్చులో 69 శాతం పెరుగుదల నమోదయింది.

- *'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఆర్థిక సంస్థకు సహాయం'* అనే అంశం కింద 2010-13 మధ్య కాలంలో ప్రతి ఏటా ఏర్పడే మిగుళ్ళు బడ్జెట్ కేటాయింపులో 34 నుండి 68 శాతం వరకూ ఉన్నాయి. ఐనప్పటికీ అవసరానికి మించి కేటాయింపులను చేసారు.

### *2.7.1.2 సబ్సిడీని తప్పుగా వర్గీకరించడం*

సబ్సిడీ కోసం నిర్దేశించిన వివరణాత్మక పద్దు '330-సబ్సిడీలు'. ఐతే, ఈ పద్దులో కాకుండా వివరణాత్మక పద్దులు '310/312-ఇతర సహాయక గ్రాంట్లు' కింద సబ్సిడీల లావాదేవీలను నమోదు చేస్తున్నారు. ఇంధన గ్రాంటుకు సంబంధించి ఈ కింది మొత్తాలను సబ్సిడీలకు బదులు సహాయక గ్రాంట్లుగా వర్గీకరించారు.

- 'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బాండ్ల శ్రేణి' పై వడ్డీని చెల్లించేందుకు వినియోగించిన ₹ 297.50 కోట్లను MH 2049-01-200-(25) విద్యుత్ బాండ్లు-450- వడ్డీ చెల్లింపులు (చార్జి చేసింది)' అనే పద్దు కింద నమోదు చేయాల్సి ఉండగా, ఈ మొత్తాన్ని పైన పేర్కొన్న పద్దు కింద నమోదు చేసారు.

- ఐపీపీల[15] నుంచి 300 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తికి ఋణంగా ఆర్ఎల్ఎన్‌జీ[16] కి విద్యుత్ ఉత్పత్తి కోసం ₹ 300 కోట్లు ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా విడుదల చేసారు. దీనిని సహాయక గ్రాంట్ల కింద వర్గీకరించారు.

[15] స్వతంత్ర విద్యుత్ ఉత్పాదకులు
[16] శుద్ధి చేసిన, ద్రవీకరించిన సహజవాయువు

### 2.7.1.3 ఇతర ప్రయోజనాల కోసం ప్రతి ఏటా చేస్తున్న నిధుల మళ్ళింపు

తొలి అంచనాలకు, సవరించిన అంచనాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటే ప్రతిపాదనలను వాస్తవికంగా తయారు చేయలేదని స్పష్టమవ్వడమేకాక, నిధులు ఏ పథకం నుండి మళ్ళిస్తారో, ఆ పథకం లక్ష్యాలు నెరవేరవు. కృష్ణపట్నంలో ఉన్న 'సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్‌స్టేషన్ కోసం 'ఏపీజెన్‌కోకు లోన్లు' అనే అంశం కోసం 2010-11, 2011-12 సంవత్సరాల తొలి బడ్జెట్లలో కేటాయింపులు చేయకుండా 2010-11లో ₹ 329.26 కోట్లు, 2011-12 లో ₹ 478 కోట్లను ఏపీట్రాన్స్‌కోకు కేటాయించిన నిధుల నుండి రీఅప్రోప్రియేషన్ చేసారు.

### 2.7.1.4 ప్రాజెక్టు వనరులు/బడ్జెట్ వనరుల నుండి నిధులను తక్కువగా ఖర్చు చేయడం

- జంటనగరాల్లోనూ, చుట్టుపక్కల నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్లు/లైన్లు నిర్మాణం కోసం జేఐసీఏ (జైకా[17]) ఆర్థికసాయంతో 'జంటనగరాల్లో విద్యుత్ ప్రసార వ్యవస్థ ఆధునికీకరణ' ను 2009 లో ప్రభుత్వం చేపట్టింది. రెండు దశలలో చేపట్టిన ఈ కార్యక్రమం 2014 జూన్‌లో పూర్తవ్వాలి. ఐతే, జైకా నుండి పొందిన ₹ 940 కోట్లు రుణం నుండి 2013 మార్చినాటికి ప్రభుత్వం ₹ 515.41 కోట్లు విడుదల చేసింది. ఫలితంగా, ఆ మరుసటి ఏడాది కాలంలో వినియోగం కోసం ₹ 424.59 కోట్లు (45 శాతం) మిగిలిపోయింది.

- ***అధిక ఓల్టేజి పంపిణీ వ్యవస్థ (హెచ్‌వీడీఎస్):*** విద్యుత్ పంపిణీలో నష్టాలను తగ్గించేందుకు, జైకా ఆర్థిక సాయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం ₹ 1,154.80 కోట్లు. ఈ ప్రాజెక్టును 2011-16 మధ్య పూర్తి చేయాలని అనుకున్నప్పటికీ, టెండర్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న కారణంగా, ప్రాజెక్టు ఇంకా మొదలు కాలేదు. 2010-11 లో కోటి రూపాయలను 'టోకెన్ ప్రొవిజన్'గా కేటాయించగా, ఖర్చు అస్సలు జరగలేదు. 2011-12 లో కేటాయించిన మొత్తం ₹ 148 కోట్లు, 2012-13 లో కేటాయించిన మొత్తం ₹ 50 కోట్లు ఏపిజెన్‌కో (కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్రాజెక్టు)కు లోన్ల కోసం రీఅప్రోప్రియేషన్ చేసారు.

### 2.7.1.5 బడ్జెట్ వెలుపలి రుణాలు

విద్యుత్ రంగానికి సంబంధించిన అవసరాల కోసం ప్రభుత్వం ఇలా బడ్జెట్ వెలుపలి రుణాలు పొందడం గత దశాబ్ద కాలంగా చేస్తోంది. అదనపు విద్యుత్ ఉత్పత్తి కోసం, 2012-13 లో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎమ్‌డీసీ) నుండి ₹ 245 కోట్లు రుణం తీసుకోవాలని ఏపీట్రాన్స్‌కోకు ఆదేశాలివ్వడం జరిగింది. ఆ మొత్తం రుణాన్ని తాము తర్వాత చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. బడ్జెట్ వెలుపలి రుణాలపై మరిన్ని వివరాలు, ఈ రుణాలను తిరిగి చెల్లించే విధానం, పద్దులమీద వీటి ప్రభావం వంటి విషయాలను **అధ్యాయం-1**లో తెలపడం జరిగింది (పేరా 1.12.4 చూడండి).

### 2.7.1.6 ఈక్విటీ, లోన్లు, గ్యారంటీలు

విద్యుత్ రంగంలోని ప్రభుత్వరంగ సంస్థలకు (పీఎస్‌యులకు) ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, లోన్లు, ఈక్విటీలకు సంబంధించి, ఆర్థిక పద్దుల్లోని వివరాలకూ ఆయా పీఎస్‌యూల బ్యాలన్స్ షీట్లలోని వివరాలకూ మధ్య వ్యత్యాసాలున్నాయి. పీఎస్‌యూల పద్దులతో పోల్చి చూసినపుడు, ఆ పీఎస్‌యూలలో ప్రభుత్వ ఈక్విటీ ఆర్థిక పద్దుల ప్రకారం, ₹ 2,925.35 కోట్లు తక్కువగా ఉండగా, ఈ పీఎస్‌యూలకు 2012 మార్చి[18] నాటికి ప్రభుత్వం ఇచ్చిన లోన్లు ₹ 2,697.96 కోట్లు ఎక్కువగా ఉన్నాయి. పీఎస్‌యూల పద్దుల ప్రకారం, బకాయిల్లో ఉన్న గ్యారంటీలు ₹ 13,116.92 కోట్లుకాగా, ఆర్థిక పద్దుల ప్రకారం ఇవి ₹ 4,393.97 కోట్లు తక్కువగా ఉన్నాయి.

[17] జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ

[18] 2012-13 పద్దులు ఇంకా ఖరారు కాలేదు

**అంతేకాక, అధిక ధర విద్యుత్‌కు సబ్సిడీ కోసం రాష్ట్రప్రభుత్వం నుండి రావలసిన మొత్తం 2012 మార్చి నాటికి (2008-09 నుండి) ₹ 13,129 కోట్లు ఉందని నాలుగు విద్యుత్ పంపిణీ కంపెనీల[19] పద్దుల నుండి తెలుస్తోంది.**

*ఏపీఎస్ఈబీ విభజన తర్వాత ఆస్తులు, అప్పుల పంపిణీ పూర్తికాకపోవటంవలన ఈ వ్యత్యాసాలు ఏర్పడ్డాయనీ, ఆస్తులు-అప్పుల పంపకాలు పూర్తయిన మీదట ఈ సమస్య సర్దుకుంటుందనీ ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో పేర్కొన్నది (2013 డిసెంబరు). కేంద్ర ప్రభుత్వ పథకం ప్రకారం డిస్కంల ఋణ బాధ్యతలలో 50 శాతం తాము తీసుకుంటామనీ ఋణ బాధ్యతలను నూరు శాతం రిస్క్ వెయిటెడ్ గ్యారంటీల కింద ప్రభుత్వ పద్దులో చేర్చామని ప్రభుత్వం లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నది.*

ఆర్థికశాఖ, పీఎస్‌యూలు ఈ వ్యత్యాసాలకుగల కారణాలను విశ్లేషించి, వాటిని సరిదిద్దుకునేందుకు సత్వర చర్యలు చేపట్టాలి.

## 2.7.2 మైనార్టీల సంక్షేమ గ్రాంటు

ఈ గ్రాంటును మైనార్టీల సంక్షేమ శాఖ నిర్వహిస్తోంది. రాష్ట్ర జనాభాలో తొమ్మిది శాతం ఉన్న ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, ఇతర మైనార్టీల సామాజిక, విద్య, ఆర్థిక అభివృద్ధి కోసం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసే బాధ్యత మైనార్టీల సంక్షేమ శాఖపై ఉంది.

### *2.7.2.1 బడ్జెట్, ఖర్చు*

2012-13 బడ్జెట్‌లో ఈ గ్రాంటుకు ₹ 611 కోట్లు కేటాయించారు. 2008-13 మధ్య కాలంలో బడ్జెట్ కేటాయింపు, ఖర్చు మిగుళ్ళ వివరాలను ఈ కింది పట్టికలో పేర్కొనడమైంది.

**పట్టిక 2.13: మైనార్టీల సంక్షేమ గ్రాంటు కింద బడ్జెట్, ఖర్చులు**

(₹ కోట్లలో)

| | 2008-09 | | | 2009-10 | | | 2010-11 | | | 2011-12 | | | 2012-13 | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు | బడ్జెట్ | ఖర్చు | మిగుళ్ళు/ అధిక ఖర్చు |
| రెవెన్యూ | 187 | 196 | 9 | 235 | 198 | (-) 37 | 319 | 325 | 6 | 334 | 365 | 31 | 571 | 350 | (-) 221 |
| క్యాపిటల్ | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 5 | 0 | (-) 5 | 35 | 0 | (-) 35 |
| లోన్లు | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 5 | 5 | 0 | 5 | 1 | (-) 4 |

*మూలం : వినిమయ పద్దులు*

- క్యాపిటల్ విభాగం కింద 2011-12 లో కేటాయించిన మొత్తం ₹ ఐదు కోట్లు, 2012-13 లో కేటాయించిన మొత్తం ₹ 35 కోట్లు అస్సలు ఖర్చు కాలేదు. లోన్లు విభాగం కింద 25 శాతం (₹ 1.25 కోట్లు) మాత్రమే ఖర్చుకాగా, మిగిలిన నిధులు (₹ 3.75 కోట్లు) సరెండరు చేసారు (2013 మార్చి).

### *2.7.2.2 వాస్తవికంగా లేని బడ్జెట్ అంచనాలు, బలహీనంగా ఉన్న బడ్జెట్ నియంత్రణలు*

ఈ గ్రాంటు కింద కేటాయించిన మొత్తంలో సుమారు 42.5 శాతం మిగుళ్ళేర్పడగా, 2012-13 ఆర్థిక సంవత్సరపు చివరి పనిదినం నాడు ఇందులో 97 శాతం సరెండరు చేసారు. యూనిట్ల నుండి ప్రతిపాదనలు రాకపోవడం, ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడం, బడ్జెట్ విడుదలను నిలుపుదల చేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల కారణంగా పీఏఓ బిల్లులను ఆమోదించకపోవడం, వాస్తవంగా అవసరమైన నిధులెంతో అంచనా వేయకుండా, గత ఏడాది బడ్జెట్ 10 శాతం పెంపుదలతో తయారు చేసిన ప్రతిపాదనలను క్షేత్రస్థాయి కార్యాలయాలు పంపడంవల్ల మిగుళ్ళేర్పడ్డాయని మైనార్టీల సంక్షేమశాఖ సంచాలకులు తెలిపారు.

---

[19] ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విద్యుత్ పంపిణీ కంపెనీ: ₹ 5345.70 కోట్లు, ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణీ కంపెనీ: ₹ 2,983.44 కోట్లు, ఆంధ్రప్రదేశ్ ఉత్తర విద్యుత్ పంపిణీ కంపెనీ: ₹ 2,525.66 కోట్లు, ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ కంపెనీ: ₹ 2,274.20 కోట్లు

రెవెన్యూ విభాగం కింద మొత్తం బడ్జెట్‌లో మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, ట్యూషన్ ఫీజుల రీఇంబర్స్‌మెంట్ కోసం కేటాయించినది 86 శాతంగా ఉంది. నిధుల వినియోగపు వివరాలను ఈ కింది పట్టికలో తెలపడమైంది.

**పట్టిక 2.14: నిధుల వినియోగపు వివరాలు**

(₹ కోట్లలో)

| | తొలి కేటాయింపు | అనుబంధ కేటాయింపు | మొత్తం కేటాయింపు | ఖర్చు | మిగులు |
|---|---|---|---|---|---|
| మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు | **147.48** | **45.32** | **192.80** | **101.78** | **91.02** |
| మైనార్టీ విద్యార్థులకు ట్యూషన్ ఫీజుల రీఇంబర్స్‌మెంట్ | **220.00** | 76.26 | 296.26 | 185.23 | 111.03 |
| మొత్తం | **367.48** | **121.58** | **489.06** | **287.01** | **202.05** |

*మూలం : వినిమయ పద్దులు 2012-13*

చేసిన ఖర్చు, తొలి కేటాయింపులను మించలేదు కాబట్టి, అనుబంధ కేటాయింపులన్నీ అనవసరమని పై వివరాల నుండి తెలుస్తోంది. బడ్జెట్ అంచనాలను వాస్తవికంగా రూపొందించడం లేదనీ, ఎప్పటికప్పుడు ఖర్చులను సమీక్షించుకోవడం లేదనీ ఇది తెలియజేస్తోంది.

### *2.7.2.3 నిరంతర మిగుళ్ళు*

క్యాపిటల్ విభాగం కింద (MH 4225-80-800-(05)-హాస్టళ్ళు, రెసిడెన్షియల్ స్కూళ్ళ కోసం భవనాల నిర్మాణం - అనే పద్దులో) గత రెండేళ్ళలో వరుసగా మిగుళ్ళేర్పడ్డాయని కనుగొనడమైంది. 2011-12 లో ₹ ఐదు కోట్లు, 2012-13లో ₹ 35 కోట్లు కేటాయించగా, ఖర్చు అస్సలు నమోదుకాలేదు.

### *2.7.2.4 పథకాల నిధులు ఖర్చు చేయకపోవడం*

బడ్జెట్ విడుదల ఉత్తర్వులను ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో జారీ చేయడం, మైనార్టీల సంక్షేమశాఖ పాలనా మంజూరీలను ఆలస్యంగా జారీ చేయడం, బడ్జెట్ విడుదలను నిలిపివేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల వల్ల వివిధ పథకాల అమలు కోసం మైనార్టీల సంక్షేమశాఖ విడుదల చేసిన ₹ 69.31 కోట్లు డ్రా చేయడానికి వీలవ్వలేదు. వివిధ పథకాలకు కేటాయించిన నిధులు ఖర్చు చేయకుండా మిగిలిపోయిన సందర్భాల్లో ప్రధానమైన వాటిని ఈ కింద పేర్కొనడమైంది.

- 'మైనార్టీ విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ స్కూల్ భవనాలు/హాస్టళ్ళ నిర్మాణం' గురించి ₹ 35 కోట్లు కేటాయించి 2013 ఫిబ్రవరిలో బడ్జెట్ విడుదల ఉత్తర్వులు జారీ చేసారు. కానీ, నియమ నిబంధనలు ఖరారు చేయడంలోని జాప్యం వల్ల ఈ నిధులను ఖర్చు చేయలేక పోయారు.

- మైనార్టీలు అధిక సంఖ్యలో నివసించే జిల్లాల్లో ప్రీ/పోస్టుమెట్రిక్ హాస్టళ్ళు, రెసిడెన్షియల్ స్కూళ్ళు నిర్వహణ/అభివృద్ధి కోసం కేటాయించిన ₹ 22.33 కోట్లకుగానూ అమలు సంస్థలు ₹ 7.17 కోట్లు మాత్రమే ఖర్చు చేసాయి. విద్యార్థులు, సిబ్బంది ఉండాల్సినంత మంది లేకపోవడమే దీనికి కారణమని తెలిపారు.

- క్రైస్తవ సామాజిక వర్గం సంక్షేమానికి అమలు చేసే పథకాల కోసం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రైస్తవ (మైనార్టీల) ఆర్థిక సంస్థకు 2010-11లో విడుదల చేసిన ₹ 9.20 కోట్లు, 2011-12లోనూ 2012-13లోనూ ఒక్కో ఏడాదికి ₹ 3.75 కోట్ల చొప్పున విడుదల చేసిన నిధులు 2013 జూన్ నాటికీ ఖర్చు కాకుండా ఉన్నాయి.

- ఇంగ్లీషు మీడియం రెసిడెన్షియల్ పాఠశాలలు, పోస్టు మెట్రిక్ హాస్టళ్ళ నిర్మాణం కోసం ₹ 2.45 కోట్ల నిధులను విడుదల చేయగా (2008 ఆగస్టు, సెప్టెంబరు), అక్రమాలు చోటుచేసుకున్న కారణంగా నిర్మాణ పనులు నిలిపివేయడం వల్ల, ఈ నిధులు ఖర్చు కాలేదు.

### *2.7.2.5 నియమాలకు విరుద్ధంగా నిధులను బ్యాంకుల్లో ఉంచడం*

ప్రభుత్వ నిధులను, ప్రభుత్వ పద్దులకు వెలుపల ఉంచడం ఆర్థిక ఔచిత్య సూత్రాలకు విరుద్ధం. వివిధ పథకాల అమలు కోసం ఉద్దేశించిన నిధులను సంబంధిత బోర్డుల ఆమోదం లేకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్లలోనూ బ్యాంకుల్లోనూ ఉంచిన వివరాలను ఈ కింది పట్టికలో పేర్కొనడమైంది.

**పట్టిక 2.15: 2013 మార్చి నాటికి నిధులను ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకుల్లో ఉంచిన వివరాలు**

(₹ కోట్లలో)

| కార్పొరేషన్ పేరు | నిధుల మొత్తం | వివరాలు |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీల ఆర్థిక సంస్థ (ఏపీఎస్ఎమ్ఎఫ్‌సీ) | 107.69 | పలు బ్యాంకు ఖాతాలు/ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఈ నిధులు ఉన్నాయి |
| ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రైస్తవ మైనార్టీల సంస్థ (ఏపీఎస్‌సీఎమ్‌సీ) | 16.90 | |
| జిల్లా కార్యాలయాలు | 4.37 | |
| ఉర్దూ అకాడమీ | 0.79 | |
| **మొత్తం** | **129.75** | |

*మూలం: శాఖాపరమైన సమాచారం*

### *2.7.2.6 వ్యక్తిగత డిపాజిట్ ఖాతాలో నిరుపయోగంగా ఉన్న నిధులు*

ఆయా కార్పొరేషన్లు, అకాడమీల వ్యక్తిగత డిపాజిట్ (పీడీ) ఖాతాల్లో 2013 మార్చి నాటికి వినియోగం కాకుండా మిగిలి ఉన్న నిధుల మొత్తం ₹ 18.47 కోట్లు. ఈ నిధులను ప్రభుత్వ ఖాతాకు బదిలీ చేయాల్సి ఉంది. వివరాలను ఈ కింది పట్టికలో తెలపడమైంది.

**పట్టిక 2.16: ఉపయోగించకుండా ఉన్న నిధుల వివరాలు**

(₹ కోట్లలో)

| పేరు | 2013 మార్చి నాటికి ఖర్చు కాకుండా మిగిలిపోయిన నిధులు |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీల ఆర్థిక సంస్థ | 13.35 |
| ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రైస్తవ మైనార్టీల సంస్థ | 1.76 |
| ఉర్దూ అకాడమీ | 3.36 |
| **మొత్తం** | **18.47** |

*మూలం: శాఖాపరమైన సమాచారం*

***అవాస్తవిక ప్రతిపాదనల ఆధారంగా చేసిన బడ్జెట్ కేటాయింపులు, బలహీనంగా ఉన్న వ్యయ పర్యవేక్షణ యంత్రాంగం, నిధులను ఆర్థిక సంవత్సరపు చివర్లో విడుదల చేయడం, పథకాల అమలు సామర్థ్యం దుర్బలంగా ఉండటం వల్ల మైనార్టీల సంక్షేమ శాఖలో నిధులు ఖర్చు కాకుండా మిగిలిపోయాయి. ఫలితంగా, లబ్ధిదారులకు ఆశించిన ప్రయోజనాలు అందలేదు. అంతర్గత నియంత్రణలు పటిష్టంగా లేకపోవడం వల్ల వివిధ సంస్థలు భారీ మొత్తంలో మిగులు నిధులను ప్రభుత్వ పద్దులకు వెలుపల ఉంచాయి.***

## 2.8 బడ్జెట్ ప్రక్రియలో లోపాలు

బడ్జెట్‌లో రాబడులు, ఖర్చులను వర్గీకరించడంలోని దోషాల ఫలితంగా పద్దుల్లో కూడా వాటి వర్గీకరణలో తప్పులు దొర్లుతాయి. దీనికి సంబంధించిన లోటుపాట్లను తగు దిద్దుబాటు చర్యలు తీసుకోవడం కోసం గత కొన్నేళ్ళుగా ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం జరిగింది. కొన్ని కేసులలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకున్నప్పటికీ 2012-13 సంవత్సరపు బడ్జెట్/పద్దులలో కొన్ని అంశాల్లో లోపాలు, పొరపాట్లు కొనసాగాయి. అందులో ప్రధానమైనవి ఈ కింద వివరించటం జరిగింది.

- **కేంద్రీయ రోడ్ల నిధి నుండి లభించే నిధుల మద్దతు కింద బడ్జెట్ అంచనాల్లో కేటాయింపులు చేయలేదు:** రోడ్ల అభివృద్ధి పనుల కోసం కేంద్రీయ రోడ్ల నిధి నుండి భారత ప్రభుత్వం, రాష్ట్రానికి నిధులను విడుదల చేస్తుంది. 'MH 3054-797' పద్దులో డెబిట్ నమోదు చేసి, 'MH 8449-ఇతర డిపాజిట్లు-103-కేంద్రీయ రోడ్ల నిధి నుండి మద్దతు' అనే పద్దుకు ఈ నిధులను బదిలీ చేయాలి. ప్రతి ఏటా అందుకునే ఈ గ్రాంటును బదిలీ చేయడానికి బడ్జెట్‌లో కేటాయింపు చేయాలి. కానీ ఈ విధంగా బడ్జెట్‌లో కేటాయింపును చేయలేదు. ఇదే విధంగా, 'MH 5054-902' పద్దు కింద కూడా కేటాయింపులు చేయలేదు. ఈ ఏడాది, MH 3054-797 కింద ₹ 163.41 కోట్లు, MH 5054-902 కింద ₹ 18.36 కోట్ల ఖర్చు నమోదయ్యింది.

- **MH 6003-రాష్ట్ర అంతర్గత రుణం కింద వచ్చిన సంస్థాగత రుణాలను జమ చేయకపోవడం:** ఎన్‌సీడీసీ, ఎల్‌ఐసీ, నాబార్డ్, జీఐసీ, ఇతర ఆర్థిక సంస్థల నుండి రుణాల రూపేణా వస్తాయని ఆశించిన రాబడులను రాష్ట్ర బడ్జెట్‌లో పొందుపర్చాలి. అదే విధంగా, ఈ రుణాలను తిరిగి చెల్లించాల్సిన వాయిదాల కోసం గ్రాంటు-IX, MH 6003 కింద కేటాయింపులు చేయాలి. ఆర్థిక సంస్థల నుండి నేరుగా వచ్చిన ఋణాలను MH 6003 కింద సరిగా జమచేయడం లేదు. వీటిని ఆయా ప్రభుత్వశాఖల రాబడి పద్దుల కింద లేదా ఇతర పద్దుల కింద ఉంచుతున్నారు. ఈ రుణాలను MH 6003, ప్రజారుణం కింద రాబడులుగా లెక్క చూపని కారణంగా, ఆయా ఆర్థిక సంస్థలకు ఈ రుణాలను తిరిగి చెల్లించేటప్పుడు రుణాత్మక నిల్వలు ఉంటున్నాయి. 2012-13 లో ఇతర సంస్థల నుండి రుణాలు (MH 6003-109) కోసం చేసిన చెల్లింపుల రూపేణా ₹ 577 కోట్లు నమోదు కావడంవల్ల ఏడాది ముగిసే నాటికి ₹ 2,901 కోట్ల రుణాత్మక నిల్వ ఏర్పడింది.

- **కేంద్ర ప్రణాళికా పథకాలను గుర్తించడానికి కొత్త సమూహ ఉప పద్దు (జీఎస్‌హెచ్) కేటాయింపు:** కేంద్ర ప్రణాళికా పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు రెండింటి కోసం GSH 10 ని ఉపయోగిస్తున్నారు. కాబట్టి కేంద్ర ప్రణాళికా పథకాలను గుర్తించడంలో సౌలభ్యం కోసం ఒక ప్రత్యేక సమూహ ఉప పద్దు (జీఎస్‌హెచ్) కావాలి. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణలో తగిన మార్పులు చేయవలసి ఉంది.

- **రెవెన్యూ, క్యాపిటల్, లోన్లు విభాగాలకు ఖర్చును విభజించక పోవడం:** హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ సంస్థ (హెచ్ఐఏఎల్) కు సంబంధించిన ఖర్చును, ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక మద్దతు ఆధారంగా రెవెన్యూ, క్యాపిటల్, లోన్లు విభాగాలకు విభజించాలి. కానీ, మొత్తం ఖర్చును క్యాపిటల్ విభాగం కింద MH 5054-03-337-SH(19)-హెచ్ఐఏఎల్ ఏర్పాటు కింద వర్గీకరించారు. ఖర్చును సరిగా విభజించకపోవడం వల్ల హెచ్ఐఏఎల్ అప్పును తిరిగి చెల్లించడాన్ని పర్యవేక్షించడం కష్టమవుతుంది.

- **వర్గీకరణలో తప్పులు:** సబ్సిడీలను వివరణాత్మక పద్దు '330-సబ్సిడీలు' కింద చూపాల్సి ఉండగా, '310-సహాయక గ్రాంట్లు' కింద చూపుతున్నారు. 2012-13 లో, వివిధ ప్రభుత్వ శాఖల్లో ₹ 6,360 కోట్లను '330-సబ్సిడీలు' కింద చూపకుండా, '310-సహాయక గ్రాంట్లు కింద చూపారు. దీనిలో ఇంధన గ్రాంటుకు సంబంధించినదే ₹ 597.50 కోట్లు ఉన్నది (పేరా 2.7.1.2 లో చెప్పిన విధంగా).

- **బడ్జెట్ అంచనాల్లో వర్గీకరణ దోషాలు:** '530-భారీ పనులు' అనే వివరణాత్మక పద్దును క్యాపిటల్ విభాగంలో నిర్వహించాల్సి ఉండగా, దాన్ని రెవెన్యూ విభాగం కింద వర్గీకరించారు. ఇలా తప్పుగా చేసిన వర్గీకరణతో 2012-13లో IX-ఆర్థికపాలన, ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు; XI-రోడ్లు, భవనాలు, ఓడరేవులు; XXXIII-భారీ, మధ్య తరహా నీటిపారుదల; XXXIV-చిన్నతరహా నీటి పారుదల గ్రాంట్ల కింద ₹ 230 కోట్లు కేటాయించారు.

- '270-చిన్నతరహా పనులు' అనే వివరణాత్మక పద్దును రెవెన్యూ విభాగం కింద నిర్వహించాల్సి ఉండగా, దీన్ని ఆయా గ్రాంట్లలో క్యాపిటల్ విభాగం కింద వర్గీకరించి 2012-13లో ₹ 452 కోట్ల కేటాయింపులు చేసారు. అదే విధంగా, '310-సహాయక గ్రాంట్లు' ను రెవెన్యూ విభాగం కింద నిర్వహించాల్సి ఉండగా, దీన్ని ఆయా గ్రాంట్లలో క్యాపిటల్ విభాగం కింద వర్గీకరించి, ఈ సంవత్సరం ₹ 8.01 కోట్ల కేటాయింపులు చేసారు.

## 2.9 సారాంశం

ఈ సంవత్సరం బడ్జెట్ అంచనాలు అవాస్తవికంగానూ, వ్యయ పర్యవేక్షణ, వ్యయ నియంత్రణలు బలహీనంగానూ ఉన్నాయి. వాస్తవంగా అయిన వ్యయం (₹ 1,30,704 కోట్లు) తొలి బడ్జెట్ కేటాయింపుల (₹ 1,46,243 కోట్లు) కంటే కూడా తక్కువగా ఉండటం, మొత్తం మిగుళ్లు (₹ 26,528 కోట్లు) బడ్జెట్‌లో 17 శాతం ఉండటం వలన అనుబంధ కేటాయింపులు మొత్తం (₹ 10,990 కోట్లు) అనవసరమని తేలింది.

అనేక పర్యాయాలు చెబుతున్నాగానీ, శాసనపరమైన సాధికారత లేకుండానే 2012-13లో ₹ 276 కోట్ల మేర అదనపు వ్యయం జరిగింది. ప్రభుత్వం 2004-05 నుంచి ఈ విధంగా చేసిన ₹ 2,876 కోట్ల ఖర్చును చట్ట సభ ఆమోదంతో క్రమబద్ధీకరించు కోవలసి ఉంది. ఆవశ్యకతపై స్పష్టత లేకుండానే 2012-13 బడ్జెట్‌లో కూడా ₹ 538 కోట్ల మేర గంపగుత్త కేటాయింపులు చోటు చేసుకున్నాయి. ఇందులో సుమారు 56 శాతం సంవత్సరాంతంలో తిరిగి ఇచ్చేశారు.

ప్రభుత్వం ప్రకటించిన పలు విధాన నిర్ణయాలు నెరవేరకపోవడం, పాక్షికంగా అమలుచేయడం జరిగింది. ఆయా పథకాల మార్గదర్శకాలు, విధివిధానాలు ఖరారు కాకపోవటం, పాలనాపరమైన అనుమతులు రాక పనులు ప్రారంభించకపోవటం, బడ్జెట్‌ను అరకొరగా విడుదల చేయటం, నిధులను బ్యాంకులలోనూ, డిపాజిట్లలోనూ ఉంచటం వంటి కారణాల వలన ప్రభుత్వం తలపెట్టిన కొన్ని విధాన నిర్ణయాలు అమలుకు నోచుకొనలేదు. అంతర్గత నియంత్రణలు పటిష్టంగా లేకపోవడం వల్ల మైనారిటీ సంక్షేమశాఖ కింది వివిధ సంస్థలు తమ మిగులు నిధులను ప్రభుత్వ పద్దులకు వెలుపల ఉంచాయి.

ప్రభుత్వ రంగ సంస్థలకు, ప్రత్యేకించి విద్యుత్తు రంగంలోని సంస్థలకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, లోన్లు, ఈక్విటీలకు సంబంధించి, ఆర్థిక పద్దుల్లోని వివరాలకూ ఆయా సంస్థల బ్యాలన్స్ షీట్లలోని అంకెలకూ మధ్య వ్యత్యాసాలున్నాయి. పీఎస్‌యూల పద్దులతో పోల్చిచూసినప్పుడు ఆ పీఎస్‌యూలలో ప్రభుత్వ ఈక్విటీ ఆర్థిక పద్దుల ప్రకారం ₹ 2,925.35 కోట్లు తక్కువగా ఉండగా ఈ పీఎస్‌యూలకు ప్రభుత్వం ఇచ్చిన లోన్లు ₹ 2,697.96 కోట్లు ఎక్కువగా ఉన్నాయి. పీఎస్‌యూ పద్దులతో పోల్చితే బకాయిల్లో ఉన్న గ్యారంటీలు ఆర్థిక పద్దుల ప్రకారం ₹ 4,393.97 కోట్లు తక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా, అధిక ధర విద్యుత్‌కు సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన మొత్తం 2012 మార్చి నాటికి (2008-09 నుండి) ₹ 13,129 కోట్లు ఉందని నాలుగు విద్యుత్ పంపిణీ కంపెనీల పద్దులనుండి తెలుస్తోంది.

## 2.10 సిఫార్సులు

1. ప్రభుత్వం తన బడ్జెట్ ప్రతిపాదనలలో మరింత వాస్తవికంగా వ్యవహరించాలి. పటిష్టమైన నియంత్రణ యంత్రాంగం రూపొందించుకుని మిగుళ్లనూ, అధిక వ్యయాన్నీ తగ్గించుకోవాలి.
2. ప్రభుత్వం మెరుగైన కార్యశీలత, పర్యవేక్షణ, ఆర్థిక నిర్వహణల ద్వారా రాష్ట్రం ఆమూలాగ్ర అభివృద్ధి కోసం తాను ప్రకటించి, అభిలషించిన లక్ష్యాల సాధనకు తన నిబద్ధతను ఆచరణలో పెట్టాలి.
3. ప్రభుత్వం పీఎస్‌యూలలో పెట్టుబడి పెట్టిన ఈక్విటీ, లోన్లు, గ్యారంటీలకు సంబంధించి ఆర్థిక పద్దులకూ, ఆయా సంస్థల పద్దులకూ మధ్య ఉన్న వ్యత్యాసాలకు కారణాలను పరిశీలించి వ్యత్యాసాలను సత్వరం తొలగించాలి.